# వసుధైక కుటుంబీకుడు

మన్నం నరసింహం



మనసు ఫౌండేషన్

# వసుధైక కుటుంబీకుడు

## మన్నం నరసింహం

రచన

**కె.బాలాజీ**

**మనసు ఫౌండేషన్**

8-2-611/3, నిషాన్-ఇ-ఇక్బాల్,
గ్రౌండ్ ఫ్లోర్, రోడ్ నెం.11, బంజారాహిల్స్,
హైదరాబాద్-500 034. ఫోన్ : 040-23323760.

**_Margadarsi Manapantulu garu_**

*by : K. Balaji*

**_First Edition_**

*23rd November 2011*

**_Type Setting & Cover Design_**

*Sahasra Graphics*

*Vijayawada*

**_Printed at_**

*Kalajyothi Process Ltd.*

*Hyderabad.*

**_Published by :_**

**_Manasu Foundation_**

*#8-2-611/3, Nishan-E-Eqbal*

*Ground Floor, Road No. 11,*

*Banjara Hills, hyderabad.*



**కీ॥ శే॥ మన్నం నరసింహం 'పంతులు' గారు**

జననం : 15-01-1922 - మరణం : 13-11-2011

# ధన్యజీవి

పుట్టిన వారు గిట్టక తప్పదని భగవద్గీత చెబుతుంది. ఈ భూమిపై నిత్యం లక్షల మంది జన్మిస్తున్నారు, మరణిస్తున్నారు. కానీ జీవించిన కాలంలో ఈ సమాజంపై తమదైన ముద్రవేసి తమ జ్ఞాపకాలను మరో పది తరాలు గుర్తుంచుకునేలా చేసేవారు కొందరే. ఆ కోవకే చెందుతారు 'పంతులుగారు' అని దేశదేశాల్లోని అభిమానులు పిల్చుకునే మన్నం నరసింహం గారు.

తాను నమ్మిన సిద్ధాంతాలు ఆచరణలో పెట్టి చూపడమే కాదు విలువలతో కూడిన జీవితాన్ని తన తరవాతి తరాలకు కానుకగా అందించారు. పుట్టి పెరిగిన సమాజానికి తమ వంతు సాయం చేయాలని, సమాజం రుణం తీర్చుకోవాలని తపించారు. దాన్నే నిత్యం స్మరించారు. తన వారసులకూ ఆ బాధ్యతలు అప్పగించివెళ్లారు.

కుటుంబం అంటే భార్యా పిల్లలు మాత్రమే కాదు. బంధువులంటే అన్నదమ్ములు, అక్కాచెలెళ్లు, సంతానం మాత్రమే కాదు. నా అనుకున్న ప్రతి ఒక్కరూ నా కుటుంబసభ్యులే అనుకున్న దొడ్డమనసాయనది. అవసరార్థం ఆశ్రయం కోరి వచ్చిన వారంతా ఆయనకు బంధువులే. వాళ్లను సొంత పిల్లల్లానే సాకారు. అంతగానూ ప్రేమించారు. ఏళ్ల తరబడి ఎంతోమందికి తన ఇంట్లో నీడనిచ్చి, వారు విద్యాబుద్ధులు నేర్చుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరేలా కృషి చేశారు. తన కింద పనిచేసిన వారు కూడా తనలా ఎదగాలని కోరుకునే మంచి మనసు ఆయనది.

తొమ్మిది దశాబ్దాల ఆయన జీవితాన్ని పరికిస్తే అందులో ప్రధాన భాగాలు మూడు. ఒకటి వైద్యం, రెండోది సేవ, మూడోది అనుబంధాలు. నేటి కాలంలో చాలా మంది వృత్తి లేదా కుటుంబం రెండింట్లో ఒకదానికి మాత్రమే పూర్తి న్యాయం చేయగలుగుతున్నారు. నరసింహంగారు ఈ రెండింటికీ న్యాయం చేస్తూ సమతుల్యత పాటించారు. ప్రతి ఒక్కరినీ ప్రేమించడం, ఎదుటివారి అభిప్రాయాల్ని గౌరవించడం, శాస్త్రీయ ఆలోచన ధోరణి, లోతైన ఆలోచన, చేతనైనంత సేవ చేయడం, విలువల్ని పాటించడం... ఆయన జీవన విధానాలుగా నిలిచాయి. ఆయన్ను వేలాది మంది అభిమానించే వ్యక్తిగా నిలిపాయి.



తన తుది శ్వాస వరకూ పంతులు గారు పేద వారికి వైద్య సేవలందిస్తూనే ఉన్నారు. సుజాత నర్సింగ్ హోం లేకపోయినా ప్రజలు ఆయన ఇంటికి వైద్య సహాయం కోసం వచ్చేవారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆయన ఎవరికీ వైద్యాన్ని నిరాకరించలేదు. రోగులకు ఆయన పట్ల ఉన్న నమ్మకం వారిపై ఆయనకున్న ప్రేమకు ఇది నిదర్శనం.

బతికినంతకాలం సమాజానికి సేవచేసిన ఆయన మరణించాక కూడా తన దేహాన్ని తను నమ్మిన, ప్రాణ సమానంగా ప్రేమించిన వైద్య విద్య అవసరాలనెరిగిన వ్యక్తిగా.. దాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనలకు ఉపయోగించాలని విల్లు రాసిన ఉదార స్వభావం ఆయనది. ప్రతి వ్యక్తిలో బలాలు, బలహీనతలు ఉంటాయి. బలం ప్రగతికి అనుకూలమైతే బలహీనతలు అభివృద్ధికి ఆటంకాలుగా మారుతుంటాయి. కానీ నరసింహం గారి విషయంలో మాత్రం... ప్రయాణాలంటే ఉన్న భయాన్ని సానుకూలాంశంగా ఆయన మలచుకున్నారు. దాన్ని వృత్తికి, కుటుంబానికి, సామాజిక సంబంధ బాంధవ్యాలకు, సేవకు తాను అంకితం కావడానికి ఆధారంగా మలచుకున్నారు. ధన్యజీవిగా నిలిచారు. ఈ పుస్తకం చదివాక మీరూ అదే మాట అంటారు.

# స్ఫూర్తి ప్రస్థానం


| | | |
|---|---|---|
| 1. | ఓ సతి త్యాగఫలం లింగమగుంట | 5 |
| 2. | మన్నం వారి ప్రస్థానం | 7 |
| 3. | బాల నరసింహం | 8 |
| 4. | ఓనమాలు | 12 |
| 5. | కొత్తపల్లి నుంచి ఒంగోలుకు..... | 15 |
| 6. | హిందూ కళాశాల విద్యార్థి | 16 |
| 7. | చదువుకు విరామం | 17 |
| 8. | మూడు ముళ్లు | 19 |
| 9. | రోగిగా చేరి వైద్యనారాయణుడిగా మారి... | 21 |
| 10. | సొంతాసుపత్రి | 26 |
| 11. | సమున్నత వ్యక్తిత్వం | 30 |
| 12. | వసుధైక కుటుంబీకుడు | 33 |
| 13. | 'ఆయన మా మిత్రుడు' | 40 |
| 14. | అందరంటేనూ ప్రాణం | 44 |
| | పంతులు గారితో ముఖాముఖి : అక్టోబరు-2011 | |

## ఓ సతి త్యాగఫలం...

# లింగమగుంట

మన్నం నరసింహం పంతులుగారి జీవిత చరిత్ర గురించి తెలుసుకొనేముందు ఆయన జన్మించిన లింగమగుంట గ్రామం గురించి తెలుసుకోవాలి. ప్రకాశం జిల్లా ఒంగోలుకు 7 కి.మీ. దూరంలో, మద్దిపాడు మండలంలో ఉంటుంది లింగమగుంట. సుమారు 600 సం॥రాల క్రితం ఈ గ్రామం ఏర్పడింది.

అప్పట్లో గ్రామాలు రెండు రకాల పద్ధతుల్లో ఏర్పడేవి. మొదటి పద్ధతి : సహజంగా, స్థానిక ప్రజలు ఏర్పాటు చేసుకొనేవి. ఇవి వివిధ కారణాల వల్ల మెల్లమెల్లగా గ్రామాలుగా ఏర్పాటు అవడం కానీ లేదా వలసల వల్ల ప్రజలు కొత్తగా గ్రామాల్ని నిర్మించుకోవడం వల్లగానీ జరిగేవి. రెండో పద్ధతిలో రాజు లేదా రాజ్యాధికారి ద్వారా గ్రామాలు నియమితమయ్యేవి.

కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో నూతన గ్రామాల్ని ఎలా ఏర్పరచాలో చాలా వివరంగా చెప్పాడు. రాజ్యానికి ఉండాల్సిన సప్తాంగాలలో జనపదం (గ్రామం) మూడోది అని కౌటిల్యుడు చెప్పాడు. 'పూర్వం జన నివాసమై తర్వాత పాడుపడిన ప్రదేశంలో, నూతన ప్రదేశంలో గానీ, పరదేశంలోని ప్రజలను ఆహ్వానించి లేదా స్వదేశంలోని జన సమ్మర్ధం గల ప్రాంతాల నుంచి ప్రజలను తరలించి గ్రామాన్ని ఏర్పాటు చేయాలని కౌటిల్యుడు చెప్పాడు. లింగమగుంట గ్రామం రెండో పద్ధతిలో ఏర్పడింది.

'లింగమగుంట' అనే పేరు రావడం వెనుక ఒక గాథ ఉంది. ఈ గాథకు చారిత్రక ఆధారాలు లేవు. కాని మౌఖికంగా ఒక తరం నుంచి మరో తరానికి అందుతూ వచ్చిన కథ ఇది.


13వ శతాబ్దం చివర్లో ఓరుగల్లు సామ్రాజ్యాన్ని పరిపాలించిన ప్రతాపరుద్రుడి మరణానంతరం బహమనీ సుల్తానులు కాకతీయ సామ్రాజ్యాన్ని ఆక్రమించుకున్నారు. మహ్మదీయుల అణచివేత వల్ల అక్కడి నుంచి అనేకమంది ప్రజలు పారిపోయారు.

అలా క్రీ.శ. 1300 సం॥లో తల్లాప్రెగడ అనే ఒక బ్రాహ్మణుడు తన కుటుంబాన్ని తీసుకొని హనుమకొండ నుంచి ఒంగోలు తాలూకా చదలవాడ గ్రామానికి వలస వచ్చాడు. ఈయన


కుమారుడు వల్లాప్రెగడ. ఈయనకు నలుగురు కొడుకులు. పెద్ద కుమారుని పేరు పెద్ద చెన్నాప్రెగడ. ఈయన భార్య లింగమ్మ. వీళ్లకు నలుగురు సంతానం.

పెద్ద చెన్నాప్రెగడ ఆధ్వర్యంలో చదలవాడ కోదండరామస్వామి గుడిలోని ముఖ మండప నిర్మాణం జరుగుతూ ఉంది. ముఖమండపం మీదికి రాళ్ళను ఎత్తుతున్నారు కూలీలు. మీట బెసికి రాయి పెద్ద చెన్నాప్రెగడ నెత్తిమీద పడటంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.

భర్త మరణాన్ని తట్టుకోలేని లింగమ్మ సతీ సహగమనం చేసింది. ఆమె జ్ఞాపకార్థంగా, ఆమె త్యాగానికి ప్రతిఫలంగా ఆ ప్రాంతపు రాజ్యాధికారి ఒక గ్రామాన్ని నిర్మించాడు. ఆ గ్రామానికి


సీ. శ్రీవైష్ణవహితుండఁ, జిక్కయభట్టరు
శిష్యుండఁ, గవితావిశేషశేష
తులితసర్వార్యపౌత్రుఁడ, లక్ష్మణయకుఁ ది
మ్మాంబకు సుతుఁడఁ, జెంద్దనకు మార
నకు రామకవివరునకు ననుజన్ముఁడ,
నా రామకవి చెప్పినట్టి మహిత
[1]మత్స్యపురాణ వామనపురాణాదిస
త్కవితల కెల్ల లేఖకుఁడ, వృద్ధ
గీ. కుండికాతీర లింగమగుంటనామ
పట్టణస్థితికుండ, సౌభాగ్యయుతుఁడ,
నాదిశాఖాప్రవర్తన నమరువాఁడఁ,
గాశ్యపసగోత్రుఁడను, దిమ్మకవిని నేను.

ఈపద్యము తంజావూరు లైబ్రరీలోని సులక్షణసారప్రతినుండి గ్రహింపబడినది.


లింగమగుంట తిమ్మకవి కృత
సులక్షణసారము
(ఛందశ్శాస్త్రము - వివరణసహితము)
విద్వాన్ శ్రీ రావూరి దొరస్వామిశర్మచేఁ
పరిష్కృతము
చెన్నపురి:
వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
వారిచే ప్రకటితము.
All Rights Reserved


'లింగమ్మగుంట' అని నామకరణం చేశారు. అదే తర్వాత లింగమగుంటగా మారింది. ఈ గ్రామం క్రీ.శ. 1400 సం॥లో వృద్ధకుండికా (ముదిగొండ వాగు) తీరంలో నిర్మితమైంది.

కాలక్రమంలో ఈ గ్రామంలోకి 16 రకాల కులాల వారు వచ్చి స్థిరపడ్డారు. గ్రామ ఆస్తుల మీద, వాటి ఆదాయం మీద సర్వహక్కులు, పన్నుల మినహాయింపుతో పెద్ద చెన్నాప్రెగడ–లింగమ్మ సంతానానికి రాజ్యాధికారి దఖలు చేశారు. వీళ్ళల్లో పెద్దవాడైన శ్రీరామభట్టు కొడుకు అన్నంరాజు. ఆయన కుమారుడు సర్వరాజు. ఈయన్ను సర్వకవి అంటారు. ఈయన ఆదిపురాణం, విరాటం అనే గ్రంథాల్ని రచించాడు.

సర్వకవి కుమారుడు లక్ష్మణప్ప. ఈయన కొడుకులు రామరాజు, తిమ్మరాజు. రామరాజును రామకవి అంటారు. ఈయన కాలం క్రీ.శ.1520–1580. రామకవి ఆనంద కానన మహత్యం, చాతుర్వాటికా మహత్యం (చదలవాడ చరిత్ర), రామాయణం తదితర గ్రంథాల్ని రచించాడు.

ఇతడు విజయనగరాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లో ఒకరైన తెనాలి రామకృష్ణుని కూతుర్ని పెళ్ళి చేసుకొన్నాడు.

రెండో వాడైన తిమ్మరాజును తిమ్మకవి అంటారు. ఈయన సులక్షణ సారము, బాలబోధ చందము అనే పుస్తకాలు రాశాడు. మహాకవి శ్రీశ్రీ తన కవిత్వ రచనా ప్రారంభానికి ఈ సులక్షణ సారము బాగా ఉపయోగపడిందని తన 'అనంతం'లో చెప్పుకున్నారు. ఈ ఇద్దరు సోదరుల రచనల ద్వారా లింగమగుంట గ్రామ చరిత్ర కొంత వరకు రూఢి అవుతూ ఉంది.



నరసింహం తండ్రి వెంకట్రాయుడు పెళ్లికి చదివింపులు

16 నుంచి 20వ శతాబ్దం వరకు ఈ గ్రామంలో గుణాత్మకమైన మార్పులేవీ రాలేదని చెప్పవచ్చు. మెట్ట లేదా వర్షాధార వ్యవసాయం మీద ఆధారపడ్డంతో చుట్టుపక్కల గ్రామాలలానే లింగమగుంట కూడా పెద్దగా మార్పులేవీ లేకుండా ఉండిపోయింది. యుద్ధాలు, కరవులు వంటివి వచ్చినపుడు ఈ గ్రామం కూడా వాటికి గురవడం, తర్వాత వాటి ప్రభావాల నుంచి కోలుకొని సాధారణ స్థితిలోకి రావడం జరుగుతూ వచ్చింది.

గ్రామం కూడా నది వంటిదే. నది ఎప్పుడూ ప్రవహిస్తుంటుంది కానీ అందులోని నీరు మాత్రం మారుతూ ఉంటుంది. గ్రామం కూడా అంతే. గ్రామం అనే భావం ఉంటుంది... ఒక నిర్దిష్ట భౌతిక ప్రదేశంలో. కానీ అందులోని ఇళ్ళూ, మనుషులూ, జంతువులూ వగైరా మారుతూ ఉంటాయి. లింగమగుంట కూడా నరసింహం పుట్టేనాటికి పెద్దగా మార్పులేవీ లేకుండా అలాగే ఉంది.

# వంశ వృక్షం

**1750లో లింగమగుంటకు వలస వచ్చిన పోలయ్య**

↓

**పేరు తెలియదు**

↓ ↓

**వెంకట రాయుడు - 1** | **చిన్న సుబ్బయ్య**

↓ | ↓ దత్తత

**రామస్వామి 1835-1902**
**పిచ్చమ్మ 1840**

↓ ↓ ↓ ↓

| | | | |
|---|---|---|---|
| పేరమ్మ 1860<br>కాకర్ల కోటయ్య<br>1850 | వెంకట రాయుడు - 2<br>1865<br>అలివేలమ్మ 1880 | సుబ్బయ్య<br>1870<br>అచ్చమ్మ 1880 | వెంకట సుబ్బమ్మ<br>1880<br>నల్లూరి నరసింహం<br>1870 |
| ↓ | ↓ | ↓ | ↓ |
| అచ్చమ్మ 1880<br>రంగయ్య 1890<br>సుబ్బయ్య 1895 | అప్పయ్య 1899<br>రామస్వామి 1909<br>పేరమ్మ 1915<br>నరసింహం 1922<br>వెంకటేశ్వర్లు 1925 | చిన్న అప్పయ్య 1900<br>శేషమ్మ 1917 | అంకమ్మ 1912<br>సుబ్బమ్మ 1915 |

# మన్నం వారి ప్రస్థానం

మన్నం వాళ్లు మన్నవ గ్రామం నుంచి వచ్చారు. మన్నవ కాలక్రమేణా మన్నంగా రూపాంతరం చెందింది. గుంటూరు జిల్లాలోని పొన్నూరు దగ్గర ఉందీ గ్రామం. అక్కడి నుంచి కొంతమంది నర్సరావుపేట వద్ద ఉన్న కారుమంచికీ, తర్వాత కొన్ని తరాలకు సంతనూతలపాడుకు దగ్గరగా ఉన్న ఏలూరివారిపాలేనికీ వచ్చారు.

ఏలూరివారి పాలెం నుంచి మన్నం వాళ్లు రెండు శాఖలుగా లింగమగుంటకు వచ్చారు. ఈ వలస దాదాపు క్రీ.శ. 1750లో జరిగింది. అందులో నరసింహంగారి పూర్వీకుడి పేరు పోలయ్య. నరసింహంగారి వంశానికి సంబంధించి 1865 నుంచి లిఖిత అధారాలు ఉన్నాయి.

1830 నాటికి మన్నం వెంకట్రాయుడు, చిన్నసుబ్బయ్య అన్నదమ్ములు. సుబ్బయ్యకు కొడుకులు లేకపోవడం వల్ల వెంకట్రాయుడు కొడుకు రామస్వామిని దత్తత తీసుకున్నారు. రామస్వామి పేరు మీద ఉన్న అధీకృత దస్తావేజులో ఈ విషయం ఉంది.

రామస్వామికి ఇద్దరు కొడుకులు. మన్నం వెంకట్రాయుడు(1865), మన్నం సుబ్బయ్య (1870). మన్నం వెంకట్రాయుడు – అలవేలమ్మకు మొత్తం 10 మంది సంతానం. అందులో 5 మంది చనిపోయారు. 5 మంది బతికారు.

వారు... 1. అప్పయ్య, 2. రామస్వామి, 3. పేరమ్మ, 4. నరసింహం, 5. వెంకటేశ్వర్లు.

ఊర్లో ఒక పెద్దాయన ఒకసారి వెంకట్రాయుడ్ని పొలానికి తీసుకెళ్లి అరక దున్నించాడు. రాయుడు చాలా బాగా దున్నుతున్నాడు. చాళ్లు నిటారుగా వాటి మధ్య ఎడం సరిసమానంగా ఉంటే దున్నటంలో నైపుణ్యం ఉన్నట్టు లెక్క. ఈ నైపుణ్యం రాయుడికి ఉందని ఆ పెద్దాయన గ్రహించి, రామస్వామికి చెప్పాడు. 'వీడికి వ్యవసాయంలో మంచి గురి ఉంది నేర్పించు' అని. రామస్వామి 'నేనెక్కడ నేర్పిస్తాను – నువ్వు నేర్పించరాదా' అనడిగాడు. దాంతో ఆ పెద్దాయన ఎంతో సంతోషంగా రాయుణ్ని తన వెంట పొలాలకు తీసుకెళ్లేవాడు. రాయుడితో పాటు వాళ్ల తమ్ముడు సుబ్బయ్య కూడా వెళ్ళేవాడు. అలా రాయుడు, సుబ్బయ్య ఇద్దరూ వ్యవసాయంలో మంచి పనిమంతులు అయ్యారు.





నరసింహం
సుబ్బమ్మ
(1922-2011)



వెంకట రాయుడు
వివాహం 1981
వైదేహి 1954



అలివేలమ్మ
(1955-1979)



డా॥ గోపీచంద్
వివాహం 1987
డా॥ మాధవి 1957



సుజాత
వివాహం 1984
శ్యామసుందరరావు 1959



పద్మజ
వివాహం 1987
మధుసూధనరావు
1962



జీ 1982
వివాహం 2011
దివ్య 1982



జెన్
1987



నికిత
1989



అభిజాత్
1985




ప్రశాంత్
1987




అకుల్
1989



ప్రతీక్
1995





రామస్వామి జమా ఖర్చుల పద్దులు తాటాకుల మీద రాసేవాడు. అవి నరసింహంగారి పెద్దబ్బాయి రాయుడికి దొరికాయి. 1902 సం॥ వరకు లెక్కలన్నీ రామస్వామి పేరు మీదే ఉన్నాయి. 1902 నుంచి వెంకట్రాయుడి పేరు మీద మొదలయ్యాయి.

1899 వికారి నామ సం॥లో అప్పయ్య పుట్టాడు. అప్పటికి రామస్వామి చనిపోయి ఉంటే ఆయన పేరు అప్పయ్యకు పెట్టి ఉండేవాళ్లు. 1909లో అప్పయ్య తమ్ముడికి రామస్వామి పేరు పెట్టారు. కాబట్టి వెంకట్రాయుడు వాళ్ల నాన్న రామస్వామి అప్పటికి చనిపోయి ఉండాలి. వీటన్నిటిని బట్టి ఆయన 1902 సం॥లో చనిపోయి ఉంటాడని అంచనా.

## 'అబ్బిగారి కుటుంబం'

లింగమగుంటలో మన్నం వారికీ, నల్లూరి వారికీ మధ్య మొదటి నుంచీ సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. నల్లూరి వంశంలోని ఒక నరసింహం భార్య గర్భవతిగా ఉన్నపుడు ఆయన చనిపోయారు. కుటుంబ సంప్రదాయం ప్రకారం పుట్టిన బిడ్డకు తండ్రి పేరే పెట్టారు. అయితే బిడ్డను భర్త పేరుతో పిలవలేక ఆమె 'అబ్బీ' అని పిలిచేది. క్రమంగా ఊర్లో అందరూ ఆ పిల్లవాడిని నరసింహం అనడానికి బదులు 'అబ్బీ' అని పిలిచేవారు. నరసింహం మన్నం రామస్వామి అల్లుడు అయ్యారు. అప్పటినుంచి మన్నం వాళ్ళనూ, నల్లూరి వాళ్ళనూ కలిపి వూర్లో 'అబ్బిగారి కుటుంబం' అని పిలవటం మొదలుపెట్టారు. ఇప్పటికీ పంతులుగారి కుటుంబాన్ని అబ్బిగారి కుటుంబమని పిలుస్తారు.

# బాలనరసింహం

వెంకట్రాయుడు, అలివేలమ్మకు నరసింహం 1922, జనవరి 15న పుట్టారు. మన్నం వాళ్లింట్లో జాతకాలు రాసే అలవాటు లేదు. దీనికీ ఒక కథ చెబుతారు.

నరసింహం గారికి అన్న వరసయ్యే సుబ్బయ్య కూతురికి కొడుకు పుట్టాడు. ఆ పిల్లాడికి రాఘవయ్య పంతులు అనే జ్యోతిష్యుడితో జాతకం రాయించారు. ఆ బిడ్డ మహర్జాతకుడనీ, రాజయోగముందనీ, ఇలా చాలా గొప్పగా చెప్పారు పంతులుగారు. కానీ పుట్టిన ఆరు నెలలకే బిడ్డ చనిపోయాడు. నరసింహం వెళ్లి పంతులుగారితో తగాదా పెట్టుకొన్నారు. ఈ సంఘటనతో జాతకాలు రాయించడం ఆపేశారు.

నరసింహం పుట్టేనాటికి గ్రామంలో అబ్బిగారి కుటుంబం ప్రముఖంగా ఉంది. గ్రామపాలనా వ్యవహారాల్లో వెంకట్రాయుడు ముఖ్యపాత్ర వహిస్తున్నాడు. అప్పట్లో అబ్బిగారి కుటుంబానికీ, నల్లూరి వాళ్లకు కలిపి ఊర్లో 60–70 ఎకరాల సొంత పొలం, ఇంకో 20–25 ఎకరాలు కౌలుకు చేస్తుండేవారు. అందువల్ల వీళ్ల కుటుంబానికి గ్రామంలో పలుకుబడి ఉండేది. గ్రామ వ్యవహారాల్లో వీళ్లే కీలకపాత్ర పోషించేవారు.

నరసింహం బాల్యం 1920ల నాటి గ్రామాల్లోని అందరి పిల్లల బాల్యం లాగే గడిచింది. అప్పుడు భూమి, పలుకుబడి ఎంత ఉన్నా వీళ్ల జీవన శైలి సాధారణ రైతు కుటుంబం లాగే ఉండేది. అప్పటి రైతు కుటుంబాల్లోని పిల్లలు ఇంటిపనుల్లో, పొలం పనుల్లో పెద్దవాళ్లకి సహాయం చేసేవాళ్లు. నరసింహం కూడా అంతే.

నరసింహం వాళ్ళకు ఒక పెంకుటిల్లు, ఒక పూరిల్లు ఉండేవి. అందులోనే కొట్టాలలో బర్రెలు, ఆవులు, ఎద్దులు ఉండేవి. దాన్ని శుభ్రం చేయడంతో నరసింహం దినచర్య ప్రారంభమయ్యేది పేడ తీయడం, చెత్తంతా ఎత్తేసి బయట పారేయడం, శుభ్రంగా ఊడ్చడం, పశువులకు కుడితి పట్టడం వంటి పనులు నరసింహం చేసేవారు. కొంచెం పెద్దయ్యాక పాలు కూడా పితికేవారు.

ఆ తర్వాత పెద్దవాళ్ళతో పాటు పొలాల్లో పని చేస్తున్న వాళ్లకి జొన్న సంకటి తీసుకెళ్ళేవారు. తర్వాత బర్రెల్ని మేతకు తీసుకువెళ్లే వారు. ఎంతైనా నరసింహమూ చిన్నవాడే కదా! ఏ మాత్రం సమయం దొరికినా తోటి పిల్లలతో ఆడుకోవడానికి వెళ్లిపోయేవాడు. కబడ్డీ, కోతి కొమ్మచ్చి,



చిలుపట్టి, కర్రాబిళ్ల వంటి ఆటలు బాగా ఆడేవాడు.

సాయంత్రం బర్రెల్ని ఇంటికి తోలుకెళ్తూ వాటి మేతకోసం పచ్చి జొన్న కంకులు వంటి ఆయా కాలాల్లో దొరికే మేత తీసుకెళ్లేవాడు. ఇలా 9 ఏళ్ల వరకూ నరసింహం బాల్యం గడిచిపోయింది.




సరిగ్గా ఆ సమయంలోనే పొగాకు పంట ప్రారంభమైంది. 1920లోనే ఐఎల్‌టీడీ (ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ) వర్జీనియా రకం పొగాకు పంటను చీరాల చుట్టుపక్కల ప్రవేశపెట్టింది.

1927 నాటికి లింగమగుంటలో కూడా రైతులు పొగాకు వేయడం మొదలు పెట్టారు. 1928లో మన్నం వెంకట్రాయుడుకి ఐఎల్‌టీడీకి మధ్య పొగాకు

పంటలకు సంబంధించిన ఒప్పందం కుదిరింది. కంపెనీ రైతులకు పంట పండించడం కోసం ఆర్థిక సహాయం చేసింది. ఉత్తరోత్రా బార్న్ (Barn)లను నిర్మించుకోవడంలో సాంకేతిక సహాయమూ అందించింది.

లింగమగుంటలో మొదటి పూర్తిస్థాయి వాణిజ్య పంటగా పొగాకును చెప్పు కోవచ్చు. అంతకు ముందు కొంతకాలం కొద్దిపాటి నీలి మందును పండించారు. పొగాకు పంట పండించేందుకు మొదటగా ముందుకొచ్చిన రైతుల్లో నరసింహం తండ్రి వెంకట్రాయుడు ఒకరు.

అయితే 1945 నాటికి కూడా లింగమగుంటలో పొగాకు ప్రధానమైన పంట కాదు. సేద్యపు భూమిలో కొంత భాగాన్ని మాత్రమే పొగాకు పంటకు కేటాయించేవాళ్లు. మిగిలిన భూమిలో ఎక్కువగా వరిగె, జొన్న, కంది, పెసలు, పత్తి వంటి పంటలు ఉండేవి. ఇంటి వాడుకకు సరిపడా మిరప, కూరగాయలు కూడా పండించేవాళ్లు.



## 'ఆ బువ్వ'... అంటే ఏ బువ్వ?

ఇప్పుడు 'అన్నం' అంటే అందరికీ వరి అన్నమే గుర్తొస్తుంది. ఎందుకంటే ఇవాళ వరి అన్నం దొరకని ప్రాంతం, కొన్ని గిరిజన ప్రాంతాల్లో తప్ప, మన రాష్ట్రంలో చాలా అరుదు. కానీ నరసింహం బాల్యంలో వాళ్ల ఊరిలో వరి అన్నం దొరికేది కాదు. వాళ్లకు భోజనమంటే జొన్న సంకటి, వరిగె అన్నమే.

వరి అన్నం లేకపోవడానికి ప్రధాన కారణం వరి పండకపోవడమే. అందువల్ల బియ్యం కొనుక్కోవాల్సి వచ్చేది. ఏ పండుగకో, లేదా ఎవరైనా ముఖ్యమైన బంధువులు వచ్చినపుడో మాత్రమే వరి అన్నం వండేవాళ్లు. పండుగలొచ్చినా, చుట్టాలొచ్చినా నరసింహానికీ, మిగిలిన పిల్లలకూ చెప్పలేనంత సంతోషం. ఆ బువ్వ తినొచ్చు కదా అని.

రోజూ వండే బువ్వ (అన్నం)కు భిన్నమైంది కాబట్టి వరి అన్నాన్ని 'ఆ బువ్వ' (That Rise) అని పిలిచేవాళ్లు. పుట్టిన ప్రాంతం, ఆర్థిక వర్గం, సంస్కృతి, మతాలను బట్టి మనుషుల ఆహారపు అలవాట్లు ఉంటాయి. మనదేశంలో అయితే కులాలను బట్టీ ఆహారపు అలవాట్లు ఉంటాయి. లింగమగుంట ప్రాంతంలో వరి పండకపోవడం, ఇతర ప్రాంతాల్లో కూడా తగినంత ఉత్పత్తి, సరఫరా లేకపోవడంవల్ల అప్పుడు వరి అన్నం అరుదైందిగా ఉండేది.

# ఓనమాలు



అప్పయ్యగారి కుటుంబం

తొమ్మిది ఏళ్ల వయసులో నరసింహం స్కూల్లో చేరారు. ఇది ఆయన జీవితంలో మొదటి మలుపు. బళ్లో చేరిన రోజు అతి సాధారణంగా అనిపించి ఉండవచ్చు. కానీ అది భవిష్యత్తులో కొన్ని తరాల జీవితాల్ని మార్చేసింది. మన్నం వాళ్లని గ్రామం అనే ఒక పరిమిత ప్రాంతం నుంచి ప్రపంచమనే విశాల విశ్వంలోకి వ్యాపించేటట్లుగా చేసింది.

అప్పట్లో లింగమగుంటలో ఒక బడి వుండేది. రామయ్య, సుబ్బయ్య అనే తండ్రీకొడుకులు

కలసి ఈ బడిని పెట్టారు. Taylor Rate School System ప్రకారం ప్రైవేటు వ్యక్తులు బడి పెడితే ప్రభుత్వం ఒక్కో అంశానికి ఒక్కో రేటింగ్ ఇచ్చి, దానిని బట్టి ఆ బడికి నిధుల్ని సమకూర్చేది. దీనికోసం బళ్లో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థుల హాజరు తప్పనిసరి. అందువల్ల బడి యాజమాన్యం పిల్లల్ని స్కూల్లో చేర్పించమని తల్లిదండ్రుల మీద రకరకాలుగా ఒత్తిడి తెచ్చేది. ఇలాంటి ఒత్తిడి ఫలితంగానే నరసింహం పొరుగింట్లో ఉండే రాఘవులు బడిలో చేరాడు. నరసింహంగారు కూడా అనుకోకుండా రాఘవులు ప్రేరణతోనే బడికెళ్లారు!

## మలుపు తిప్పిన రాఘవులు

మనిషి జీవితం అనేక యాదృచ్ఛిక పరిణామాలతో నిండి ఉంటుంది. ఒక్కో సారి మన ప్రమేయమేమీ లేకుండా మన జీవితాలు కొన్ని మలుపులు తిరుగుతాయి. అలాంటి ఓ యాదృచ్ఛిక ఘటన మూలంగానే పంతులుగారి జీవితం మొదటి మలుపు తిరిగింది.

అప్పుడు నరసింహం వయస్సు 9 ఏళ్లు. వీళ్ల ఇంటి పక్కనే అబ్బూరి రాఘవులు అనే పిల్లవాడు ఉండేవాడు. ఇద్దరూ మంచి స్నేహితులు. ఒక రోజు నరసింహం, రాఘవులు కలసి బర్రెలను మేతకు తోలుకెళ్లారు. రాఘవులు బర్రె ఒక రైతు పొలంలో పడి పంట మేసేసింది. కడుపు మండిన ఆ రైతు బర్రె నడుము విరగ్గొట్టాడు. దూరంగా ఎక్కడో ఆడుకుంటున్న రాఘవులు ఈ సంఘటనతో భయపడి ఇంటికి పారిపోయాడు.

ఆ తర్వాత బర్రెలు కాయడానికి రాఘవులు రాలేదు. కొన్ని రోజుల తర్వాత ఆ ఊరికి కోయదొరలు వచ్చారు. వాళ్ల చుట్టూ పిల్లలంతా చేరారు. అందులో నరసింహం కూడా ఉన్నారు. ఇంతలో రాఘవులు కనిపించాడు. 'ఏరా బర్రెలు కాయడానికి రావడం లేదు' – అని అడిగాడు నరసింహం. 'నేను బడికెళ్తున్నానురా' అన్నాడు రాఘవులు. మా బర్రె నడుం విరిగింది కదా? బర్రెలు కాసేపని లేదు కదా! అందుకని బడికి పొమ్మన్నాడు మా నాన్న' అని రాఘవులు చెప్పాడు.

బడి గురించి కాసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు. బళ్లో పప్పులు, శెనగలు, బెల్లం – ఇవన్నీ ఇస్తున్నారని తెలిసి ఉత్సాహపడుతున్న నరసింహన్ని 'నువ్వు కూడా బడికి రారా నాతో' అని పిలిచాడు రాఘవులు. 'నాక్కూడా రావాలని ఉందిరా..మరి పలక లేదే?' అన్నాడు నరసింహం. 'నా పలకుంది కదా ?' అంటూ రాఘవులు వెంటనే తన పలకను రెండుగా విరగ్గొట్టి ఒక చెక్కని నరసింహానికి ఇచ్చాడు. 'మరి బలపం రా..' అన్నాడు నరసింహం. రాఘవులు మారు మాట్లాడకుండా జేబులోంచి పొడవాటి బలపాన్ని తీసి, రెండుగా విరిచి నరసింహానికి ఒక ముక్క ఇచ్చాడు. అలా బళ్లో చేరాడు నరసింహం. అలా 9 ఏళ్ల వయసులో రాఘవులు రూపంలో పంతులుగారి జీవితం చదువు అనే మలుపులోకి తిరిగింది. ఆ మలుపు పంతులు గారి జీవితాన్నే కాకుండా వందలాది ఇతరుల జీవితాలను కూడా ప్రభావితం చేసింది.

నరసింహంగారి అన్నయ్య రామస్వామి, నరసింహంగారి బావగారు అంకమ్మ కూడా ఆ బడిలో కొంతవరకు చదివారు. అప్పటికి లింగమగుంట బడిలో 5వ తరగతి వరకే ఉంది.

స్కూల్లో ఫీజు ఏమీ ఉండేది కాదు. పలక, బలపం ఉండేవి. ఎక్కాలు, తెలుగు పుస్తకాలు ఉండేవి. ఒకటి రెండు వర్గాల వాళ్లు తప్ప మిగిలిన అందరి పిల్లలూ చదువుకునేవాళ్లు. చాలా తక్కువ సంఖ్యలో ఆడపిల్లలు కూడా కొందరు బడికి వెళ్లేవాళ్లు.

అలా నరసింహంగారు బడిలో అయిదవ తరగతి వరకు చదువుకున్నారు. బడికి పోయేటప్పుడు కూడా ఉదయం, సాయంత్రాలు యథావిధిగా ఇంటిపని, పొలం పనుల్లో సహాయం చేసేవారు.

నరసింహంగారి పెద్దన్నయ్య అప్పయ్యకు చదువంటే చాలా ఇష్టం. ఆయనకూ, నరసింహంగారికీ వయసులో 23 ఏళ్లు తేడా. దాంతో సొంత కొడుకులా చూసుకునే వారు. అప్పయ్య చివరివరకూ నరసింహం గారిని చదువు విషయంలో బాగా ప్రోత్సహించారు.

లింగమగుంటలో 5వ తరగతి పూర్తి చేసిన నరసింహంగార్ని అప్పయ్య, పక్కనే ఉన్న కొత్తపల్లి అప్పర్ ప్రైమరీ స్కూల్లో 6వ తరగతిలో చేర్పించారు. లింగమగుంటకూ–కొత్తపల్లికి 2 మైళ్ల దూరం. అప్పట్లో 15–20 మంది పిల్లలు రోజూ లింగమగుంట నుంచి కొత్తపల్లికి వెళ్లి చదువుకునేవారు. రానూ పోనూ రోజూ 5 మైళ్ల నడక. ఉదయమే వీళ్ల కోసం ఇళ్లల్లో వరిగె అన్నం లేదా రాగి సంకటి చేసి, అందులోకి పచ్చడి వేసి ఇచ్చే వాళ్లు. వీళ్లు పుస్తకాలు, పలకలతో పాటు దాన్ని కూడా తీసుకొని వెళ్లే వాళ్లు.



# కొత్తపల్లి నుంచి ఒంగోలుకు...

నరసింహం కొత్తపల్లిలో 6, 7 తరగతుల్ని పూర్తి చేశారు. చదువులో బాగా చురుకుగా ఉండేవారు. ఆయనకు ముఖ్యంగా లెక్కల్లో ఎంతో ఆసక్తి. ఆ సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చేవి. 6, 7 తరగతులు అయిపోయాక అప్పయ్య నరసింహాన్ని ఒంగోలు మునిసిపల్ హైస్కూల్లో 8వ తరగతిలో చేర్పించారు.


ఒంగోలు మునిసిపాలిటీ 1876లో ఏర్పడింది. తర్వాత కొన్ని సంవత్సరాలకి మునిసిపల్ స్కూలు ప్రారంభమయ్యింది. అప్పట్లో ఆర్థికంగా, సామాజికంగా కాస్తో కూస్తో ఒక స్థాయిలో ఉన్నవారు ఎక్కువగా చదువుకునేవాళ్లు. బ్రాహ్మణేతరులు కూడా కొంతమంది ఈ బడిలో చేరేవాళ్లు. క్రిస్టియన్లు ఏబీఎమ్ బడికెళ్లేవాళ్లు.

మొదట్లో ఇతర పిల్లలతో కలిసి లింగమగుంటనుంచి 7–8 కి.మీ. దూరం నడిచి వెళ్లేవారు నరసింహం. ఆ తర్వాత కమ్మ హాస్టల్‌లో చేరారు. ఈ హాస్టల్‌లో వరి అన్నం పెట్టే వాళ్లు. లింగమగుంట నుంచి నరసింహం, అల్లూరు నుంచి ఆయన సిఫార్సుతో చేరిన బంగారు ఉండేవాళ్లు.

నరసింహం, ఆయన మిత్రులు హాస్టల్‌లో గోడదూకి సినిమాలకు వెళ్లేవారు. అయితే ఆయన చదువును మాత్రం అశ్రద్ధ చెయ్యలేదు. లెక్కల్లో ఎప్పుడూ మంచి మార్కులు వచ్చేవి. అల్లరి కూడా బాగానే చేసేవారు. తరగతి గదిలో పంతులుగారు పాఠాలు చెబుతుంటే మా పాటికి మేం అల్లరి చేసేవారమని నరసింహంగారు చెప్పారు. బళ్లో ఆడపిల్లలు కూడా ఉండేవాళ్లు కానీ చాలా తక్కువ. పల్లెటూరి నుంచి వచ్చిన పిల్లల్లో కొంత బెరుకుదనం వుండేది. ఆడపిల్లల వంక కన్నెత్తి కూడా చూసేవాళ్లు కాదు.

ఊళ్లో ఆడే ఆటలతో పాటు నరసింహం గారు ఇక్కడ కొత్తగా వాలీబాల్ ఆడటం నేర్చుకున్నారు. తరువాత్తరువాత ఈ ఆటలో మంచి నైపుణ్యం సంపాదించారు. కృపారావుతో వాలీబాల్ ఆటవల్లనే దగ్గర స్నేహం ఏర్పడింది.

అప్పటి బడి ప్రధానోపాధ్యాయుడు రాఘవరావు, తెలుగు పండితులు రామ, కోటేశ్వరరావులంటే నరసింహంగారికి చాలా ఇష్టం. తెలుగు పంతులు గారిది ముక్కుసూటితత్వం. ఒకసారి నరసింహం గారు స్నేహితులతో కలిసి బీడీ తాగుతూ ఆయనకు


1.2.41

తొమ్మిది రూపాయలు పంపమని కోరుతూ అన్న అప్పయ్యగారికి నరసింహం రాసిన ఉత్తరం
**01-02-1941**

దొరికిపోయారు. ఆయన చాలా హితబోధ చేశారు వాళ్లకి. అయినా అప్పుడప్పుడూ నరసింహంగారు బీడీలు కాల్చేవారు. కొంతకాలం సిగరెట్లు, ఆ తర్వాత చుట్టలు. అయితే 1969 నుంచి ఈ అలవాట్లను మానేశారు.

అలా 1943లో నరసింహమే లింగమగుంట గ్రామం నుంచి మొదట ఎస్.ఎస్.ఎల్.సి. ఉత్తీర్ణుడైన విద్యార్థి. ఈయన కన్నా ముందు ఒకబ్బాయి ఎస్.ఎస్.ఎల్.సి. చదివాడు. కానీ గట్టెక్కలేదు. అతను ఊర్లో 'చెడు ఉదాహరణ'గా ఉండేవాడు. అతను చదువుకోవడం వల్లనే అనేక దురలవాట్లు నేర్చుకొన్నాడనీ, ఇటు వ్యవసాయానికీ పనికి రాకుండాపోయాడనీ, చదువుకొంటే అందరూ అతనిలాగే అవుతారనీ ఊళ్లో పెద్దలు భావించేవాళ్లు.

# హిందూ కళాశాల విద్యార్థి




ఎస్.ఎస్.ఎల్.సి. పాస్ అయిన తర్వాత నరసింహంగారిని గుంటూరు హిందూ కాలేజీలో FA (ఫెల్లో ఆర్ట్స్) లో ఎం.పి.సి. (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో చేర్పించారు. ఇది రెండేళ్ల కోర్సు. ఇప్పటి ఇంటర్మీడియట్‌కు సమానం. అప్పట్లో ఎం.పి.సి.ని ‘రాయల్ గ్రూపు’ అని పిలిచేవాళ్లు.

ఆ రోజుల్లో బ్రాహ్మణేతర విద్యార్థులకు అద్దె గదులు దొరకడం చాలా కష్టంగా ఉండేది. అప్పట్లో కులం పట్టింపులు చాలా ఎక్కువ. ఏ కులం వాళ్లు ఆ కులం వాళ్లకే ఇళ్లను అద్దెకు ఇచ్చేవాళ్లు. అందువల్ల పల్లెటూర్ల నుంచి వచ్చే విద్యార్థుల కోసం పట్టణాల్లో వసతి సదుపాయాలు ఉండక పోవటంవల్ల, కొంతమంది దాతలు విడిగా వసతిగృహాలు కట్టిస్తూ ఉండేవాళ్లు. అయితే ఈ వసతిగృహాలు కూడా ఏ కులానికి ఆ కులం ప్రత్యేకంగా ఉండేవి. వాటిలో ఇతర కులాల వారికి చోటు లేదు. పైగా బ్రాహ్మణేతరుల్లో అగ్రకులాల్లోనే అప్పుడు సామాజిక, ఆర్థిక చైతన్యం

ఎక్కువ. అందువల్ల, ఆ కులాల విద్యార్థులకే ఎక్కువగా వసతిగృహాలు ఉండేవి. ఎక్కడో ఓ చోట వసతి కావాలి కాబట్టి తప్పనిసరై గుంటూరులో కమ్మ వసతిగృహంలో చేరారు నరసింహంగారు.

అప్పట్లో ఆ వసతిగృహంలో రెండు రకాల విద్యార్థులు ఉండేవాళ్లు. రుసుం చెల్లించేవాళ్లు మొదటిరకం. వీళ్లకు ఆ భవనంలో మొదటి అంతస్థు కేటాయించేవాళ్లు. ఉచితంగా ఉండే వాళ్లకు నేల అంతస్థును కేటాయించేవాళ్లు. ఎవరైనా ఒక విద్యార్థి రుసుం కట్టేవాడా, ఉచితంగా ఉంటున్నాడా తెలుసుకోవాలంటే, 'ఏ అంతస్థు' అని అడిగేవాళ్లు. సమాధానాన్ని బట్టి అతను ఏ రకానికి చెందినవాడో తెలిసిపోయేది.

నరసింహం మొదటి అంతస్థు విద్యార్థి. నరసింహం రుసుము కోసం ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. అప్పయ్యగారు నరసింహం చదువు సంగతి చూసుకొనేవారు. నరసింహం కళాశాల, వసతిగృహం రుసుంలకు, ఖర్చులకీ ఆయనే డబ్బులు పంపేవారు.

ఎఫ్.ఎ.లో కూడా నరసింహం బాగా చదివేవారు. అప్పటికే ఒంగోలులో మూడేళ్లు చదివి ఉండటం వల్ల పట్టణ వాతావరణానికి బాగా అలవాటుపడ్డారు. అందువల్ల పల్లెటూరు నుంచి వచ్చిన వాళ్లకుండే బెరుకూ, బిడియం ఆయనకు లేవు.

నరసింహం చేరిన హిందూ కాలేజీ 1935లో ప్రారంభమైంది. ఇది లేకముందు గుంటూరు ఆ చుట్టుపక్కల ప్రాంతాల పిల్లలు కాలేజీ చదువు కోసం మదరాసు వెళ్లాల్సి వచ్చేది. అందుకని కొంతమంది దాతలు కలసి ఈ కళాశాలని ప్రారంభించారు. మొదట్లో సంస్కృత పాఠశాలగా ఉన్న ఈ సంస్థ క్రమేణా అభివృద్ధి చెందింది. టి.టి.కృష్ణమాచారి, కాసు బ్రహ్మానందరెడ్డి, కొత్త రఘురామయ్య వంటి హేమాహేమీలెందరో ఈ కళాశాల విద్యార్థులే. నరసింహంగారి భవిష్యత్తుకు కూడా ఈ కళాశాల మంచి పునాది వేసింది.

నాటకాలు చూడడం, అడపాదడపా సినిమాలకు వెళ్లడం, కబడ్డీ, వాలీబాల్ ఆడటం వంటి సరదాలూ, అలవాట్లు ఉండటం తప్ప, ప్రధానంగా ఆయన ధ్యాసంతా చదువు మీదే ఉండేది. తీరా పరీక్షల సమయానికి ఆయనకు మానసిక ఆందోళన వచ్చేసేది. ఎందుకో తెలియని భయం కమ్ముకునేది. చివరికి పరీక్షలు రాయకుండానే గుంటూరు నుంచి లింగమగుంటకు వచ్చేశారు. అప్పయ్యవాళ్లు కూడా ఆయన పరిస్థితిని అర్థం చేసుకొన్నారు. మరేమీ ఒత్తిడి చెయ్యలేదు.



# చదువుకు విరామం

ఇక చదువు సంగతి అంతే అని అందరూ అనుకొన్నారు. నరసింహంగారు ఖాళీగా ఉండటం ఇష్టం లేక అన్నలకు చేదోడుగా వ్యవసాయంలోకి దిగారు. 1945లో నరసింహంగారి నాన్న వెంకట్రాయుడు చనిపోయారు. అప్పటికి ఆయన వయస్సు దాదాపు 80 సం॥లు. నాన్న చనిపోయిన సమయానికి నరసింహం ఆయన మృతదేహాన్ని చూసేందుకు భయపడి ఇంటికి దూరంగా ఉండిపోయారు. ఎవరూ ఏడవకుండా ఉంటే వస్తానని చెప్పడంతో, అన్నలు అలాగే ఏర్పాటు చేశారు. నిశ్శబ్దంగా వచ్చి చనిపోయిన తండ్రి భౌతికకాయాన్ని చూసి వెళ్లిపోయారు నరసింహంగారు.

ఊళ్లో బ్రాహ్మణులు, వైశ్యులు, ముస్లింలు, క్రైస్తవులు, కమ్మ, చాకలి, మంగలి, కంసాలి, కమ్మరి, వడ్రంగి, వడ్డెర, మాల, మాదిగ – ఇలా అన్ని రకాల వారూ నివసించేవారు. దాదాపు అందరికీ పొలం ఉండేది, వ్యవసాయం చేసేవారు. బ్రాహ్మణులు కూడా కొందరు వ్యవసాయమే చేసేవారు. వైశ్యుల్లో ఎక్కువభాగం వ్యవసాయం చేసేవారు. కొద్దిమంది చిన్నచిన్న వ్యాపారాలు చేసేవారు. రైతులకు అప్పులు కూడా వీరే ఇచ్చేవారు.

ముస్లింలలో కొంతమంది వ్యవసాయం చేసేవారు. కొంతమంది ఒంగోలులో గుర్రపు బళ్లు తోలేవారు. సైకిళ్ల రిపేర్లు చేయడం, ఇతర సాంకేతిక పనులు చేసేవారు. పొగాకు వచ్చాక ముస్లింలకు పని పెరిగింది. బార్న్‌లు, గొట్టాలు వగైరాల మరమ్మతులు ముస్లింలు చేసేవారు.

కమ్మవాళ్లంతా వ్యవసాయమే చేసేవారు. వీరిలో బెజవాడవాళ్లు, అబ్బిగారి కుటుంబం గ్రామ పెత్తనం దగ్గరనుంచీ, గ్రామ వ్యవహారాల్లో ముందుండేవాళ్లు. మిగిలిన కులాలు కులవృత్తులతోపాటు కొద్దిపాటి వ్యవసాయం కూడా చేసేవాళ్లు. లింగమగుంటలో జమిందారీ పద్ధతి లేదు. రైతువారీ పద్ధతే. అందువల్ల ప్రభుత్వం వైపునుంచి రైతులకు పెద్ద ఇబ్బందులేవీ ఉండేవి కావు.


నరసింహం సుమారు అయిదు సంవత్సరాలు లింగమగుంటలో వ్యవసాయం, ఇంటి పనుల్లో కుటుంబానికి చేదోడువాదోడుగా ఉన్నారు. ఆయన ఉన్న కాలంలో గ్రామంలోగానీ, కుటుంబంలో గానీ పెద్దగా చెప్పుకోదగిన ఒడిదొడుకులేవీ లేవు. లింగమగుంట గ్రామం దాదాపు శాంతియుత గ్రామమే. మూడు మతాలు, అనేక కులాలు ఉన్నప్పటికీ గ్రామంలో ఎప్పుడూ

కక్షలూ, కార్పణ్యాలూ, ఘర్షణలూ లేవు.

అప్పట్లో ముస్లిం కుటుంబాలు 30 వరకూ ఉండేవి. అందరూ అన్యోన్యంగా ఉండేవారు. ముస్లింలకూ హిందువులకు మధ్య ఎప్పుడూ మత ఘర్షణలు చోటు చేసుకోలేదు. మామూలుగా అన్ని గ్రామాల్లోనూ చోటు చేసుకొనే చిన్న చిన్న ఘర్షణలు వంటివే కానీ మత సంబంధ వివాదాలెన్నడూ లేవు. ముస్లింలు-హిందువులు బంధువుల్లా 'మామా, అన్నా, అత్తయ్యా' అని వరుసలు పెట్టి పిలుచుకునేవారు. ఒకరి పండుగలకు ఒకరు వెళ్లేవారు. ఎవరిళ్లలో ఏ కార్యం జరిగినా మిగిలిన వాళ్లు సహాయ సహకారాలు అందించేవాళ్లు. మనస్ఫూర్తిగా వాటిలో పాలు పంచుకొనేవారు. ఇలాంటి గ్రామీణ వాతావరణంలో నరసింహం అయిదు సంవత్సరాలు ఉన్నారు.

ఒకసారి నరసింహం మిత్రుడొకరు లింగమగుంటకు వచ్చాడు. అతను నరసింహాన్ని కాలేజీలో చేరమని ప్రోత్సహించాడు. వాళ్ల అన్నయ్యలతో కూడా మాట్లాడాడు. నరసింహం పెద్దన్నయ్య అప్పయ్యకి నరసింహం చదువు మీద చాలా ఆసక్తి ఉంది. నరసింహం పెద్ద చదువులు చదువుకుంటే బాగుండుననే అభిప్రాయం ఉంది. అందువల్ల ఆయన కూడా నరసింహంను ప్రోత్సహించారు. మళ్లీ ఆయన చదువుకొనేందుకు గుంటూరుకు బయలుదేరారు.

ఇది ఆయన జీవితంలో అతి ముఖ్యమైన రెండో మలుపు.


Secondary School-Leaving Certificate.

(*Issued under the authority of the Government of Madras.*)

ISSUED BY ~~District Educational Officer~~, SERIAL No. 54731

STATION ______

*Date* ______

Signature

Designation District Educational Officer, Guntur

1. Name of the pupil (in full). Mannam Narasimham.
2. Nationality, caste or religion. Hindu - Kamma
3. Sex. Male.
4. Date of birth (by the Christian era and the year of birth in words). 15-7-22 (Nineteen Hundred and twenty-two).
5. Father's name.
6. Personal marks of identification (care should be taken to select two or three distinctive marks)—
   (1)
   (2)

(Signature)

*Date* 20.6.40.

*Head* master / ~~mistress~~

MUNICIPAL HIGH SCHOOL
ONGOLE. ______ *School*

7. School or schools attended for the High School course commencing from Form IV with the years and forms :—

| Name of school. | Period of study. | Form or forms. |
|---|---|---|
| M. H. School, Ongole. | 1939 - 42 | IV, V, VI, |

8. School or schools attended for supplementary courses with the years of study :—

| Name of school. | Period of study. |
|---|---|
| M. H. School Ongole | 42-43. |

NOTE.—Erasures and unauthenticated or fraudulent alterations in the Certificate will lead to the cancellation of the same—(*vide* Rule 6 of the S.S.L.C. Subsidiary Rules).

[PRICE, 3 *annas.*]

# మూడుముళ్లు



1950లో నరసింహం దిగ్విజయంగా ఎఫ్.ఎ. పరీక్షలు రాసి పాసయ్యారు.

అదే సంవత్సరం గుంటూరులో ఎ.సి. కాలేజీలో డిగ్రీ ఎం.పి.సి.లో చేరారు. ఇది ఆంధ్ర క్రైస్తవ కళాశాల. దీన్నే ఎ.సి. కాలేజీ అని పిలుస్తారు. ఇది భారతదేశంలోనే ప్రాచీనమైన కళాశాలల్లో ఒకటి. ప్రొటెస్టెంట్ చర్చ్ విద్యావ్యాప్తికి చేసిన కృషిలో ఇది ఒక భాగం.

యునైటెడ్ లూథరన్ చర్చ్ ఇన్ అమెరికా (యు.ఎల్.సి.ఎ.) రెవరెండ్ ఫాదర్ జాన్ క్రిస్టియన్ ఫ్రెడెరిక్ హేయర్ (ఫాదర్ హేయర్‌గా ప్రసిద్ధుడు) ఆధ్వర్యంలో 1842, జులై 31న ఆంధ్ర ఎవాంజెలికల్ లూథరన్ చర్చ్‌ను ఏర్పాటు చేసింది.

ఈ చర్చ్ ఆధ్వర్యంలో గుంటూరులో 1842లో ఆంగ్లో-వెర్నాకులర్ బడి ప్రారంభమైంది. ఇదే 1885లో ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలగా పరిణామం చెందింది.

డిగ్రీ చదివేటప్పుడు నరసింహం గారు మిత్రులతో కలసి బయట గది

తీసుకొని ఉండేవారు. భోజనం హోటళ్లలో చేసేవారు. వితంతువులు కొందరు నడిపే హోటల్ ఒకటి ఉండేది. ఆ స్త్రీలను 'ధవళ వస్త్ర కిరీటధారులు' అని పిలుచుకునే వారు. 'పూరి విలాస్' అని ఇంకో హోటల్‌లో కూడా నరసింహంగారు భోంచేసేవాళ్లు. తిన్న గుర్తుగా పుస్తకంలో ఎప్పటికప్పుడు రాసేవారు. నెలనెలా డబ్బులిచ్చేవారు.

నరసింహంగారికి గుర్తున్నంత వరకూ వాళ్ల కళాశాలలో బ్రాహ్మణ విద్యార్థులకీ – కమ్మ విద్యార్థులకీ సరిపడేది కాదు. పెద్ద ఘర్షణలేవీ ఉండేవి కావు. కానీ, కబడ్డీ ఆటలో వారి శతృత్వం బయటపడేది. చెరొక వర్గంగా చాలా పట్టుదలగా ఆడేవారు.

నరసింహం చాలా అరుదుగా సినిమాలు చూసేవారు. టికెట్ రేటు పావలా ఉన్నట్టు ఆయన గుర్తుచేసుకున్నారు. ఆయన చూసిన వాటిలో బాగా జ్ఞాపకం ఉన్న సినిమా దిలీప్‌కుమార్ నటించిన 'కిస్మత్'. నాటకాలకు్కాడా వెళ్లేవారు. బాగా గుర్తున్న నాటకం 'వింధ్యారాణి'. వెంకటేశ్వర్లు అనే నటుడు ఆడవేషం వేయడంలో ప్రసిద్ధుడు.

అప్పట్లో నరసింహంగారి జీవితానికి ప్రత్యేక లక్ష్యాలు ఏమీ లేవు. బాగా చదువుకోవాలని మాత్రమే ఉండేది. వైద్యం పట్ల మాత్రం అమితమైన ఆసక్తి ఉండేది.

నరసింహంగారు వాలీబాల్ ఆడటంలో దిట్ట. ఒకసారి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు కాలేజీ తరపున నరసింహంగారిని పంపారు. ఆయన చిన్న చిన్న పిల్లల్తో జట్టును సిద్ధం చేసి తన నాయకత్వంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని గెలిచారు. ఈ గెలుపు అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. చివరికి నరసింహంగారు కూడా ఆశ్చర్యపోయారు. నరసింహంగారు శారీరక వ్యాయమాలు కూడా చేసేవారు. పుల్అప్స్ ఎక్కువగా తీసేవారు.

డిగ్రీ చదువుతుండగానే అన్నలు నరసింహంగారికి పెళ్లి నిశ్చయించారు. అప్పటికే వయస్సు 30కి చేరింది. ఆ రోజుల్లో అది ఎక్కువ వయస్సే. బెజవాడవారిపాలెంకు చెందిన బెజవాడవారి ఆడపడచు సుబ్బమ్మతో నరసింహంగారి పెళ్ళి 1951లో జరిగింది. రెండు కుటుంబాలకూ అంతకుముందే బంధుత్వం ఉంది. పెళ్లికి నరసింహం సమ్మతి అడగటం వంటివి అన్నలు చేయలేదు. పెళ్లి నిశ్చయించి కబురు చేశారు. అన్నల మాట జవదాటని నరసింహం సుబ్బమ్మ గారి మెడలో మూడుముళ్లూ వేశారు. పెళ్లి లింగమగుంట ఇంట్లోనే జరిగింది.

పెళ్లయ్యాక కొత్తదంపతులు కొంతకాలం గుంటూరులో కాపురం పెట్టారు. అప్పట్లో డిగ్రీ రెండు సంవత్సరాలు. రెండో సంవత్సరం డిగ్రీ పరీక్షలప్పుడు నరసింహం గారికి మళ్లీ ఆందోళన మొదలైంది. పరీక్షలు రాయలేదు. చివరికి 1952లో భార్యతో సహా లింగమగుంటకు వెళ్లిపోయారు. అయితే లింగమగుంట గ్రామం నుంచి మొదటిసారిగా డిగ్రీకి వెళ్ళిన వ్యక్తిగా నరసింహంగారు నిలిచిపోయారు.

# రోగిగా చేరి వైద్యనారాయణుడిగా మారి....

లింగమగుంటలో ఉన్నపుడు పంతులుగారికి మళ్లీ ఆందోళన వచ్చింది. దాంతో ఆయన మిత్రుడు డాక్టర్ కృపారావు నరసింహంగారిని ఒంగోలులో తన అన్నయ్య డాక్టర్ బొల్లినేని వెంకట లక్ష్మీ (బీవీయల్) నారాయణ హాస్పిటల్‌లో చేర్చారు. ఇలా ఆసుపత్రిలో చేరడం పంతులుగారి జీవితంలో మరో ముఖ్యమైన మలుపు.

ఇక్కడ బీవీఎల్ నారాయణ గురించి క్లుప్తంగా చెప్పుకోవాలి. బీవీఎల్ నారాయణది ఎనికపాడు. మదరాసు వెళ్లి ఎమ్.బి.బి.యస్. చదివారు. తన అన్న జ్ఞాపకార్థం 1948లో ఒంగోలులో బి.ఆర్.రావు మెమోరియల్ ఆసుపత్రి పెట్టారు. ఆయనకు పేదల డాక్టర్ అనిపేరు. పేదల నుంచి అసలు రుసుం తీసుకోరు. ఒ.పి.కి సంవత్సరం మొత్తానికీ రుసుం ఒక రూపాయి. అదీ ఇచ్చే స్తోమత లేకపోతే ఇవ్వకపోయినా ఫర్వాలేదు. ఒంగోలు చుట్టుపక్కల వందలాది గ్రామాల నుంచి రోగులు ఆయన ఆసుపత్రికి వచ్చేవారు. ఆసుపత్రిలో ఏ రకమైన సౌలభ్యాలూ ఉండేవి కావు. ఎవరి మంచం, దుప్పటి వాళ్లే తెచ్చుకోవాలి. వాళ్లు ఉండటం కోసం ఆసుపత్రి పక్కన ఉండే ఖాళీ స్థలంలో గుడిసెలు ఉండేవి. ఎవరి భోజనం ఏర్పాట్లు వారివే. అయితే పేదలకు అవసరమైన వైద్యం మాత్రం వెంటనే లభించేది. 1953లో నరసింహం ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. నారాయణ నరసింహానికి అన్ని పరీక్షలూ చేసి ఏ జబ్బూ లేదని, కేవలం జబ్బు ఉన్నట్టు మానసికంగా భ్రమ పడుతున్నాడని చెప్పారు. కానీ నరసింహం మాత్రం ఆసుపత్రి వదలి బయటికి వెళ్లడం లేదు.



35 ఏళ్ల నరసింహం

**నరసింహం, 'పంతులుగారు' ఎలా అయ్యారు?**

బీవీఎల్ నారాయణగారికి ఒక అలవాటు ఉంది. ఆయన ఎవర్నీ అసలు పేర్లతో పిలవరు.

అందరికీ మారుపేర్లు పెడతారు. ఆయన పెట్టిన పేర్లు ఎంతగా వాడుకలోకి వస్తాయంటే, అందరూ అసలు పేర్లను మరచిపోతారు.

నరసింహం విషయంలో కూడా ఇలానే జరిగింది. ఆసుపత్రిలో చేరిన కొన్ని రోజులకే బీవీఎల్ నారాయణ నరసింహంను 'పంతులూ' అని పిలిచారు. కారణం నరసింహం ఎర్రగా ఉండేవారు, వేషభాషలు, ఉచ్చరణ అన్నీ బ్రాహ్మణుల్ని పోలి ఉండేవి. తెలియని వారు ఆయన్ను చూస్తే బ్రాహ్మణ పంతులు అనుకొనేవారు. అందువల్ల బీవీఎల్ నారాయణ కూడా నరసింహాన్ని పంతులు అని పిలిచారు. అప్పటినుంచి 'నరసింహం' స్థానంలో 'పంతులు' వచ్చి చేరింది. అందరూ 'పంతులుగారు' అనే పిలిచేవారు. లేదా నరసింహం పంతులు అనేవారు. కొంతమంది 'పంతులు డాక్టరుగారు' అనేవారు.

ఆ ఆసుపత్రిలో నారాయణగారి చెల్లెలు లక్ష్మీకాంతమ్మ పేరుతో ఒక మందుల కొట్టు ఉండేది. దాన్ని ఒక విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు చూసుకునేవాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆయన వెళ్లిపోయాడు. దాంతో ఆ కొట్టు చూసుకునే నాథుడు లేకపోయాడు. ఎంతకీ బయటికి వెళ్లకుండా ఉన్న నరసింహాన్ని చూసి బీవీఎల్ 'వెళ్లి మందుల కొట్లో కూర్చో' అని చెప్పారు. అప్పటి నుంచి నరసింహం దాన్ని చూసుకొనే వారు. అదే ఆ తర్వాత 'కార్నర్ మెడికల్ షాపు' అయింది.



**బి.ఆర్.రావు మెమోరియల్ ఆసుపత్రి సిబ్బంది**

మరోవైపు ఆసుపత్రి పనులన్నీ కూడా నరసింహం చేయడం మొదలు పెట్టారు. ఆయన అంకితభావం, పనితనం చూసిన నారాయణగారు ఆ మందుల కొట్టును తనే నిర్వహించుకొని, వచ్చే ఆదాయాన్ని తీసుకోమని చెప్పారు. తన స్థలంలో ఉన్న పూరిల్లును పంతులుగారి కుటుంబానికి ఇచ్చారు. పంతులుగారు సుబ్బమ్మతో ఆ గుడిసెలో కాపురం పెట్టారు. 1954లో తొలి సంతానం. కొడుకు పుట్టాడు. కుటుంబ సంప్రదాయం ప్రకారం తండ్రి వెంకట్రాయుడి పేరు కొడుక్కి పెట్టుకున్నారు. 1954 చివర్లో పంతులుగారి తల్లి అలివేలమ్మ చనిపోయింది. తర్వాత ఆరునెలలకి రెండో సంతానం ఆడపిల్లకి తల్లిపేరు 'అలివేలమ్మ'ను పెట్టుకున్నారు.

మందుల కొట్లో చెరుకూరి వెంకటేశ్వర్లు అనే అతన్ని పెట్టి పంతులుగారు పూర్తి సమయం ఆసుపత్రి కోసమే వినియోగించేవారు. మెల్లగా జనరల్ ఫిజీషియన్ చేసే అన్ని రకాల చికిత్సలూ

# వెంటాడిన తెలియని భయం

"భయం. భయం అనేదానికి కారణం ఉంటే, అది భయం కాదు" – నరసింహం

'అది ఒక ఆదివారం పంతులుగారు బాగా మాలిష్ చేయించుకొన్నారు. మధ్యాహ్నం మిత్రులతో కబడ్డీ ఆడారు. రెండు గంటల పాటు అదే లోకం. చివరికి రెండు జట్లు హోరాహోరీగా ఆడి, డ్రాగా ముగించాయి. రెండు గంటలు నిర్విరామంగా ఆడినందుకో, ఏమో ఆకస్మాత్తుగా దడ, మెదడులోకి బాధ వచ్చేశాయి. 'చచ్చిపోతున్నా, చచ్చిపోతున్నా' అని అరిచారు. కృపారావు వాళ్లు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఆయనకు అన్నీ భయాలే. నిజానికి ఈ సంఘటన జరగక ముందు నుంచి కూడా ఆయనలో తెలియని భయం ఉంది. మొదటగా అది బయటపడింది గుంటూరులో (FA) పరీక్షలప్పుడు భయంతో ఆయన పరీక్షలు రాయకుండా వచ్చేశారు. ఆయనకున్న భయానికి వెల్లూరు డాక్టర్లు కార్డియో న్యూరోసిస్ పేరు చెప్పారు.

అసలు ఏమిటి ఈ వ్యాధి ? నిజానికి ఇది వ్యాధి కాదు. ఒక మానసిక వికల్పం (Dissorder). దీనివల్ల తమకు గుండెనొప్పి ఉన్నట్లు వాళ్లు భ్రమిస్తారు. గుండెనొప్పికి సంబంధించిన రోగ లక్షణాలన్నీ వాళ్లకు కనిపిస్తాయి. కానీ వైద్య పరీక్షల్లో అవేవీ ఉండవు. అంటే ఆ గుండెనొప్పి శారీరకమైంది కాదు. కేవలం మానసికమైంది. ఈ రకమైన వికల్పం మొదటగా బయటపడింది అమెరికా అంతర్యుద్ధ (Civil War) కాలం (1861–1865) లో. సైనికుల్లో భయం వెంటాడుతుంటే, దాని సంగతిని పరిశీలించమని అమెరికన్ ప్రభుత్వం జాకబ్ మెండెస్ ద కోస్టా అనే డాక్టర్ని పంపింది. ఆయన ఆ సైనికుల్ని పరిశీలించి ఈ రోగ లక్షణాల్ని నిర్ధరించాడు. అందుకనే దీనికి (Da Costa's Syndrome) అనే పేరు వచ్చింది. (Sodier's Heart) అని కూడా పిలిచేవారు. యుద్ధానంతర రోగాల్లో ఒకటిగా దీన్ని గుర్తించారు. దీన్నే తర్వాత కార్డియాక్ న్యూరోసిస్, క్రానిక్ ఏస్తీనియా వంటి అనేక పేర్లతో పిలిచారు.

నరసింహంగారిని ఆ భయం ఏదో ఒక రూపంలో దశాబ్దాలుగా వెంబడించింది. మొదట పరీక్షలంటే భయం. తర్వాత ప్రయాణాలంటే భయం. కొంతకాలం ఎత్తైన ప్రదేశాలంటే భయం. ఈ భయం మూలంగానే ఆయన చాలా ఏళ్ల పాటు ఒంగోలు వదిలి వెళ్లలేదు. వెళ్లిన అతి కొద్ది సందర్భాలలో కూడా డాక్టరు వెంట ఉండాల్సిందే.

2005లో ఆయన కుమారుడు గోపీచంద్ ఆయణ్ని విమానంలో హైదరాబాద్ తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఈ భయం క్రమేపీ తగ్గుముఖం పట్టింది. అయితే ఈ భయం లేదా దడ ఆయన వృత్తికి ఎప్పుడూ అడ్డంకి కాలేదు. వేలాది శస్త్రచికిత్సలు చేశారు. కానీ ఆ దడ ఎప్పుడూ రాలేదు. ఒకరకంగా ఈ భయం ఆయన తన వృత్తిమీద మరింత ఏకాగ్రతతో పనిచేయడానికి ఉపయోగపడింది. ఎక్కడికీ ప్రయాణాలు చేయకపోవడం వల్ల ఆయన తన మొత్తం కాలాన్ని వైద్యానికే అంకితం చేశారు.



పంతులుగారి ఇల్లు - 1967

చేయడం, సూదిమందు వేయటం, గాయాలను శుభ్రం చేయడం వంటి పనులన్నీ నేర్చుకున్నారు. క్రమంగా శస్త్రచికిత్సలు చేయడమూ నేర్చుకొన్నారు. అఖండమైన తెలివి, చేసే పని మీద ఏకాగ్రత, ఇతరులు చేసే పనిని శ్రద్ధగా పరిశీలించడం, ఆసుపత్రి పని తప్ప మరో ధ్యాస లేకపోవటం, తెలిసిన దానిని ధైర్యంగా, చొరవతో ఆచరణలో పెట్టడం– ఈ లక్షణాల మూలంగా పంతులు గారు అతి తక్కువ కాలంలో వైద్యానికి సంబంధించి అన్ని శాఖల్లో మంచి ప్రావీణ్యం సంపాదించారు.

అదే సమయంలో నరసింహం దంపతులకు గోపీచంద్, సుజాత పుట్టారు. గుడిసె స్థానంలోనే చిన్న పెంకుటిల్లు కట్టుకున్నారు. ఆఖరి అమ్మాయి పద్మజ. ఈ ఇంట్లోనే పుట్టింది. మొత్తం కుటుంబం 600 చదరపు అడుగుల ఆ చిన్న పెంకుటింట్లోనే నివసించేది. ఇల్లెప్పుడూ బంధుమిత్రులతో కళకలాడుతూండేది. ఇల్లు చిన్నదే కావచ్చు, కానీ నర్సింహం హృదయం విశాలమైనది. మందుల కొట్లో వచ్చే చాలీచాలని ఆదాయంతోనే ఆయన అంతమందికీ ఆశ్రయం ఇచ్చేవారు. అవసరమైనప్పుడు ఆర్థిక సహాయమూ చేసేవారు.



రాయుడు



గోపీచంద్

ఇక్కడ సుబ్బమ్మ గారి గురించి చెప్పుకొని తీరాలి. సహనానికీ, సేవకూ మారుపేరు సుబ్బమ్మ. కుటుంబంలోని ఏడుగురితో పాటు కనీసం ఎప్పుడూ మరో పది మంది అతిథులు ఉండేవారు. విసుగూ, విరామం లేకుండా సుబ్బమ్మగారు అందరికీ వండి వారుస్తూ ఉండేవారు. ఒకసారి అతిథుల కోసం దోసెలు వేస్తుంటే, అవి కుప్పలుగా పేరుకున్నాయట. వాటిని చూసి ఎవరో హోటల్ అనుకొని దోసెలు అమ్ముతారా అని అడిగారట! ఇంత సేవ చేస్తున్నా, ఆమె ఎప్పుడూ చిరాకు పడలేదు.

1957లో ప్రకాశం పంతులు చనిపోయిన తర్వాత ఏర్పడిన ఖాళీ

స్థానానికి అసెంబ్లీ ఉప ఎన్నికలు జరిగాయి. ఆ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బీవీఎల్ నారాయణ పోటీచేసి గెలిచారు. ఆ తర్వాత దఫా కూడా గెలిచారు. దాదాపు పదేళ్ల పాటు బీవీఎల్ నారాయణ ఎమ్మెల్యేగా ఉండటంవల్ల, తన పూర్తి కాలాన్ని ఆసుపత్రికి వెచ్చించలేకపోయారు. ఆ కాలంలో నారాయణ తమ్ముడు కృపారావుతోపాటు నరసింహం మొత్తం ఆసుపత్రిని చూసుకునేవారు.

బీవీఎల్ నారాయణ కొంచెం కోపిష్టి. రోగుల్ని దూషించడం, కఠినంగా మాట్లాడటం చేసేవారు. అందువల్ల రోగులు అతని దగ్గరికి వెళ్లడానికి జంకేవాళ్లు. పంతులుగారు సరదా మనిషి. రోగులతో జోకులేస్తూ, వాళ్లను నవ్విస్తూ వాళ్లతో సన్నిహితంగా, ఆత్మీయంగా ఉండేవారు. అందువల్ల రోగులు బీవీఎల్ దగ్గర చూపించుకోవడం కన్నా నరసింహం గారికి చూపించుకోవడానికే మొగ్గు చూపేవాళ్లు.

మరోవైపు 1965 నాటికి ఎమ్.బి.బి.యస్. చదువుకొని కొత్తగా ప్రాక్టీసు పెట్టిన రావిపాటి ప్రసాద్, రమణరావు, రాజమ్మ వంటి అనేక మంది డాక్టర్లకు నరసింహం పంతులు క్షేత్ర శిక్షణ ఇచ్చేవారు. నరసింహంతో పాటు వాళ్లంతా ఒక జట్టుగా పనిచేసేవారు. నరసింహం శస్త్రచికిత్సలు చేస్తున్నపుడు వాళ్లు సహాయం చేస్తుండేవారు. ఈ విధంగా 1970ల నాటికి ఒంగోలు చుట్టుపక్కల మంచి వైద్యుల్లో ఒకరుగా నరసింహం పంతులుగారు పేరు తెచ్చుకొన్నారు.

రెండోసారి ఎన్నికల్లో ఓడిపోయిన బీవీఎల్ నారాయణ పూర్తి సమయాన్ని ఆసుపత్రిలోనే గడపడం ప్రారంభించారు. అప్పటికే నరసింహంతో ఉన్న సాన్నిహిత్యంతో రోగులు నేరుగా ఆయన దగ్గరికే వెళ్లేవారు. ఇదంతా బీవీఎల్-నరసింహంకు మధ్య బయటికి కనిపించని కొంత ఇబ్బందికరమైన వాతావరణాన్ని సృష్టించింది. చివరికి ఒక కేసు విషయంలో బీవీఎల్ నారాయణ కొంత అసహనంతో నరసింహం పంతులుగారి మీద మాట తూలారు. అప్పటివరకూ ఎవరి చేతా మాటపడని పంతులుగారు ఎంతో నొచ్చుకొన్నారు. అప్పటికే ఇద్దరి మధ్యా అంత స్నేహపూర్వక వాతావరణం లేదు. ఇక అక్కడ కొనసాగడం అర్థం లేదని నిర్ణయించుకొన్న పంతులు గారు 1971లో ఆ ఆసుపత్రి నుంచి శాశ్వతంగా బయటికి వచ్చేశారు.



డా॥ బి.వి.ఎల్. నారాయణ కుటుంబం (నిలుచున్న వ్యక్తి డా॥ నారాయణ)


# సొంతాసుపత్రి

ఆసుపత్రితో పాటు నారాయణగారి స్థలంలో ఉన్న తన పెంకుటిల్లును కూడా వదిలేసి, మరింత చిన్నదైన ఒక ఇంట్లో అద్దెకు దిగారు. బీవీఎల్ నారాయణ ఆసుపత్రి నుంచి బయటికి వచ్చేయడం పంతులుగారి జీవితంలో అతిపెద్ద మలుపు. సినిమాలో విరామం లాంటిది. ముందస్తు ప్రణాళిక లేదు. బయటికెళ్లాక ఏం చేయాలో తెలియదు. ఆసుపత్రి నుంచి బయటికి వచ్చే సమయానికి పంతులుగారికి అప్పులు, ఆర్థిక కష్టాలు, ఏటా నష్టాలు తెచ్చే వ్యవసాయమే మిగిలాయి.

పిల్లలు చదువుల్లో ఉన్నారు. రాయుడు అప్పుడే డిగ్రీలో చేరాడు. మిగిలిన పిల్లలు కూడా


రాయుడు


అలివేలమ్మ


గోపీచంద్

ఇంటర్, హైస్కూలు చదువులకు వచ్చారు. ఆయన జీవితంలో బహుశా అది అత్యంత కష్ట సమయం, క్లిష్ట పరిస్థితి.

'ఒక వ్యక్తి నిజమైన స్వభావం ఒత్తిడి పరిస్థితులలోనే బయటికి వస్తుంది' – అంటాడు రాబర్ట్ మెకీ అనే అమెరికన్ సినీ రచయిత. సరిగ్గా అలాంటి ఒత్తిడి పరిస్థితే పంతులుగారికి ఎదురైంది. అయితే ఒత్తిడి పరిస్థితి ఎలాంటిదైనా ఆయన దానికి తలొగ్గరని తేలింది. 50 ఏళ్ల పంతులుగారు కష్టాల సుడిగుండాల్ని ధైర్యంగా ఎదురీదారు. జీవితాన్ని సున్నా నుంచి పునః ప్రారంభించారు.

అయిదుగురు పిల్లలు, భార్య సుబ్బమ్మ ఆయన నిర్ణయాన్ని స్వాగతించారు. ఆయనకు అండగా నిలబడ్డారు.

ఇప్పుడేం చేయాలి? జీవనాధారం కోసం ఏం పని చేయాలి ? వేరే ఆసుపత్రిలో పని చేయటమా? అని తీవ్రంగా మదనపడ్డారు. చివరికి సొంత ఆసుపత్రి పెట్టడమే మేలని నిర్ణయించుకున్నారు. అదైతేనే పేదలకు సేవ కూడా చేసినట్టవుతుందని నరసింహం గారి ఆలోచన. దాదాపు 20 ఏళ్లుగా నిరంతరం శ్రమించి నేర్చుకున్న వైద్య జ్ఞానానుభవాల్నే ఆయన నమ్ముకున్నారు. అద్దంకి బస్టాండు సమీపంలో ఆసుపత్రి పెట్టాలని నిర్ణయించుకున్నారు. అక్కడ అయితే లింగమగుంట, పరిసర గ్రామాలకు దగ్గరగా ఉంటుందని, ఇంకా మిగిలిన గ్రామాల వారికీ వచ్చేందుకు అనుకూలంగా ఉంటుందనీ ఆయన దాన్ని ఎంచుకున్నారు. వెదగ్గా వెదగ్గా బస్టాండుకు సమీపంలోని ఇస్లాంపేటలో ఒక ఇల్లు అద్దెకు దొరికింది. దాంట్లోనే 'సుజాతా నర్సింగ్‌హోం'ని ప్రారంభించారు. అదే సమయంలో మిత్రుడు స్వర్ణ కోటేశ్వరరావుతో కలసి 'ఎక్స్‌రే' క్లినిక్‌ను కూడా బ్యాంకు అప్పుతో ప్రారంభించారు. అయితే ఆర్థిక సమస్యలు మాత్రం ఆయన్ను వెంబడిస్తూనే ఉన్నాయి.



పద్మజ, సుజాత (నరసింహంగారి కుమార్తెలు)

ఆసుపత్రిని ప్రారంభించగానే పెద్ద సంఖ్యలో రోగులు వస్తారనుకున్న పంతులుగారి అంచనా తప్పింది. కొంతకాలం వరకూ రోగులు పెద్దగా వచ్చేవారు కాదు. ఇస్లాంపేట పేద ముస్లింల బస్తీ. అందువల్ల వచ్చే ముస్లిం రోగులు కడు పేదలు. దాంతో పంతులు గారు వారి దగ్గర ఎలాంటి రుసుమూ తీసుకోకుండానే అవసరమైన వైద్యసేవలు అందించేవారు.




మొత్తమ్మీద ఆసుపత్రి ద్వారా తగినంత రాబడి లేదు. మరోవైపు పిల్లలు రాయుడు, గోపీచంద్ ఉన్నత చదువులు ప్రారంభించారు. రాయుడు అఖిల భారత ప్రవేశ పరీక్షలో ఎంపికై, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరులో ఇంజనీరింగ్ కోర్సులో చేరారు. గోపీ కూడా వైద్య ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణుడై గుంటూరు



**సుజాత పెళ్లిలో నరసింహం దంపతులు**

వైద్య కళాశాలలో చేరారు.

అదే కాలంలో నరసింహంగారి కుమార్తె అలివేలమ్మను అనారోగ్యం గుండెజబ్బు రూపంలో పీడించింది. ఆమెను రాయవెల్లూరు తీసుకెళ్లి శస్త్రచికిత్స చేయించారు. కానీ తరువాత అయిదేళ్లయినా కాకముందే ఆమె ఆరోగ్యం విషమించింది. మద్రాసు రైల్వే ఆసుపత్రిలో చేర్చారు. అయినా ఫలితం లేకపోయింది. తిరిగి కొన్నాళ్లకే అమ్మ పేరు పెట్టుకొన్న బిడ్డ తనని విడచి వెళ్లిపోయింది. ఈ సంఘటన మొత్తం కుటుంబాన్ని కలచివేసింది.

గుండెజబ్బుతో చనిపోయిన అక్క కోసం తాను గుండె వైద్యుడవ్వాలని గోపీచంద్ నిర్ణయించుకున్నారు. రాయుడు కూడా తన చెల్లెలి జ్ఞాపకార్థం ఎం.ఎస్.లో బయో మెడికల్ ఇంజనీరింగ్‌లో గుండె గురించి పరిశోధన చేశారు.

1971 నుంచి 1981 వరకు కనీసం దశాబ్దం పాటు నరసింహం కుటుంబం కష్టాల్ని అనుభవించింది. అయితే సుజాతా నర్సింగ్‌హోం ద్వారా పంతులుగారు పేద రోగులకు మరింత దగ్గరయ్యారు. బీవీఎల్ నారాయణగారి ఆసుపత్రిలో తను పూర్తి స్వతంత్రుడు కాడు. ఇప్పుడు పూర్తిగా తనకు తనే బాధ్యుడు.

పంతులుగారి సమస్యలకు చివరకు పరిష్కారాలు లభించాయి. ఎదిగొచ్చిన కొడుకులిద్దరూ కష్టాల్ని ఎదుర్కోవడం ప్రారంభించారు. పెద్ద కుమారుడు రాయుణ్ని ప్రొఫెసర్లు పి.హెచ్.డి. చేయమని చాలా ఒత్తిడి చేశారు. దాని వల్ల తన కుటుంబ బాధ్యత నిర్వర్తించడం ఆలస్యం అవుతుందన్నది రాయుడి ఆలోచన. అందుకే హెచ్.సి.ఎల్. సంస్థలో ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత సౌదీ అరేబియా వెళ్లారు. అప్పటికే రాయుడికి పెళ్లైంది. ఒక కొడుకు కూడా. వాళ్లను తనతో తీసుకువెళ్లే వెసులుబాటు లేక రాయుడు భార్యాపిల్లల్ని తల్లిదండ్రుల దగ్గరుంచారు. మరో వైపు గోపి జమైకా వెళ్లాడు. అక్కడి నుంచి అమెరికా గానీ, ఇంగ్లండు కానీ వెళ్లాలని ఆయన ఉద్దేశం.

క్రమంగా కష్టాలు కారుమబ్బుల్లా తొలగిపోయాయి. అప్పులు తీరాయి. ఆడపిల్లలు సుజాత, పద్మజ కూడా ఉన్నత చదువులు అభ్యసించారు. సుజాతకు 1984లోను పద్మజ, గోపీచంద్‌లకు 1987లోను పెళ్లిళ్లయ్యాయి. అందరూ చక్కగా జీవితాల్లో స్థిరపడ్డారు.

గోపీ లండన్ వెళ్లి ఎఫ్.ఆర్.సి.ఎస్. చదివాడు. గోపీ మన దేశం తిరిగి రాగానే, ఒంగోలులో ప్రాక్టీసు చేయాలని పంతులుగారు ఆశించారు. కానీ గోపీచంద్ తాను థొరాసిక్ సర్జన్ కాబోతున్నాననీ, ఆ ప్రాక్టీసుకు ఒంగోలు సరిపోదనీ, ఏదైనా నగరంలో అయితే బాగుంటుందని తండ్రికి చెప్పాడు. పంతులుగారు ఒప్పుకోలేదు. ఒంగోలులో ఆసుపత్రి కట్టిస్తే, తనే ప్రాక్టీసు చేస్తాడులే అనుకున్నారు. తమ సొంత స్థలంలో ఆసుపత్రి కోసం భవనం కట్టించారు.

అయితే లండన్ నుంచి చదువు పూర్తి చేసుకుని తిరిగివచ్చిన గోపీచంద్ పంతులుగారికి తన



డా॥ గోపీచంద్ మాధవిల వివాహం

స్పెషలైజేషన్ గురించి, దానికి అవసరమైన వాతావరణం, పరికరాల వంటి వాటి గురించి వివరంగా చెప్పి ఒంగోలులో ప్రాక్టీసు చేసే అవకాశం లేదని ఆయన్ని ఒప్పించాడు.

ఆ ఆసుపత్రి భవనాన్ని ఇంటిగా మార్చారు. మరోవైపు 1988 నాటికి రాయుడు సౌదీ నుంచి ఇండియా తిరిగొచ్చి బెంగళూరులో మిత్రులతో కలసి వ్యాపారం ప్రారంభించారు. ఆయన వ్యాపారవేత్తగా అక్కడే స్థిరపడ్డారు.

1994లో తిరిగివచ్చిన డాక్టర్ గోపీచంద్ హైదరాబాద్‌లో అపోలో, కేర్ ఆసుపత్రుల్లో థొరాసిక్ సర్జన్‌గా పనిచేసి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. 2008లో మిత్రులతో కలసి హైదరాబాద్‌లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన స్టార్ హాస్పిటల్‌ను నెలకొల్పారు.



నరసింహంగారి కుటుంబం 1987

అతి తక్కువ కాలంలోనే అది అనుకొన్న లక్ష్యాల్ని అధిగమించి విజయవంతంగా నడుస్తోంది, నాణ్యమైన చికిత్సను అందించే ఆసుపత్రిగా పేరు సంపాదించుకుంది.

నరసింహంగారు తన 65 ఏళ్ల వయసులో అంటే 1987 తర్వాత అన్ని విషయాల్లోనూ స్థిమితపడ్డారు. అయితే తన వృత్తిలో శ్రమించడం మాత్రం ఆపలేదు. సుజాత నర్సింగ్ హోంను 2002 నాటికి మూసివేశారు. అయినా చివరి వరకూ రోగులకు ఇంటిదగ్గరే చికిత్స చేసేవారు.



**నరసింహం, సుబ్బమ్మ దంపతులు**

90 ఏళ్ల వయసులో ఆయన తన సంపూర్ణ జీవితాన్ని చాలించారు. 2011 నవంబర్ 13వ తేదీ, ఆదివారం ఉదయం నాలుగు గంటలకు డాక్టర్ మన్నం నరసింహం పంతులుగారు ఈ లోకాన్ని వదలి సంతృప్తిగా వెళ్లిపోయారు.





# సమున్నత వ్యక్తిత్వం

పంతులుగారు తన జీవితంలో ఎక్కువ భాగం పరిమిత స్థలం (Limited Space) లోనే జీవించారు. ప్రయాణాల పట్ల ఆయనకు ఉన్న భయం కావచ్చు, తన వృత్తివల్ల వెసులుబాటు లేక కావచ్చు ... కారణాలేమైనా ఆయన జీవితంలో ఎక్కువ భాగం ఒంగోలు దాటి వెళ్లలేదు. అయినప్పటికీ ఆయనలో విభిన్న వ్యక్తిత్వం ఉంది.

ఆయన ఆధునికుడు. ప్రధానంగా విద్య ద్వారా ఆధునికతలోకి ప్రవేశించారు. ప్రతి విషయాన్నీ హేతుబద్ధంగా పరిశీలించడం, తార్కికంగా ఆలోచించడం, కార్యాకారణ సంబంధాల్ని అన్వేషించడం అలవాటుగా మార్చుకున్నారు. ఏ విషయాన్నైనా శాస్త్రీయ పద్ధతిలో అర్థం చేసుకోవడం పంతులుగారికి ఆధునికత మూలంగా వచ్చింది. అదే సమయంలో ఆయన పూర్వ సమాజంలోని కొన్ని మంచి లక్షణాల్నీ జీవితాంతం ఆచరించారు. కుటుంబ విలువలు, గ్రామం పట్ల ప్రేమ, బంధుమిత్రులతో నిరంతరం కలిసి మెలిసి ఉండటం, ప్రతి ఒక్కరినీ మర్యాదగా చూడటం, వారి ఆలోచనలను గౌరవించడం, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించడం... వంటివి ఆయన నమ్మిన, ఆచరించిన విలువలు.

చదువుకూ, శాస్త్ర విజ్ఞానానికి సంబంధం లేకుండా ఆయనలో సహజ జ్ఞానం (Intution), వివేకం (Wisdom) ఉన్నాయి. కేవలం బుద్ధితో, తార్కిక శక్తితో మాత్రమే విషయాల్ని అర్థం చేసుకోకుండా, మానవీయ విలువలు, భావోద్వేగాలకు ఆయన ప్రాముఖ్యతనిచ్చేవారు.

ఆయన శ్రమజీవి. గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగి, శ్రమ సంస్కృతిలో భాగం కావడంవల్ల కావచ్చు పనికి విలువ, గౌరవాల్ని ఇచ్చేవారు. బీవీఎల్ నారాయణ ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఇల్లు కూడా పరిసరాల్లోనే ఉండటంవల్ల ఆయన పూర్తి సమయం రోగుల సేవలోనే గడిపారు. చనిపోకముందు కొన్ని నెలలు తప్ప, మొత్తం జీవితంలో ఆయనెప్పుడూ విశ్రాంతి తీసుకోలేదు. తన వృత్తిలోనే సేద తీరేవారు. విశ్రాంతి తీసుకోవాలన్న ఆలోచనే ఆయన దరికి రాలేదు. ఆయన చాలా సరదా మనిషి. హాస్యప్రియుడు. ఆయన మాటల్లో వ్యంగ్యం ఒక్కోసారి చాలా పదునుగా ఉండేది. పైకి సరదాగా కనిపించినా, లోపల ఆయనలో ఒక సీరియస్ వ్యక్తి ఉన్నారు. విషయాలపట్ల సీరియస్‌నెస్ ఉండేది. ఆయనలో ప్రస్ఫుటంగా కనిపించే మరో విషయం ఏమిటంటే బాల్యం సజీవంగా ఉండటం. తొంభై ఏళ్ల వయసులో కూడా ఆయనలో తొమ్మిదేళ్ల పిల్లాడు ఉండేవాడు. పిల్లల్లో ఉండే నిష్కళంకత్వం, స్వచ్ఛత, జీవితం పట్ల కుతూహలం ఆయనలో చివరి వరకూ ఉండేవి. వృద్ధాప్యం శరీరానికి వచ్చిందే కానీ, ఆయన మనసుకు కాదు. పంతులు గారు ఎప్పుడూ నవ యువకుడే. అందుకనే ఆయన పిల్లల్తో బాగా కలిసిపోయేవారు.

ఆయనకు చాలా మంచి అభిరుచులు ఉండేవి. మంచి పుస్తకాలు చదివేవారు. సాహిత్యం చదవడం ఆయనకు ఇష్టమైన విషయాల్లో ఒకటి. మంచి సినిమాలు చూసేవారు, పాటలు పాడేవారు. బాగా హుషారుగా ఉంటే నృత్యం కూడా చేసేవారు.


తను వైద్య విద్యనభ్యసించకపోయినా అనుభవం ద్వారా వైద్యం నేర్చుకొన్న వ్యక్తి. అయితే వైద్యరంగానికి సంబంధించిన పుస్తకాలు కూడా బాగా చదివేవారు. తన దగ్గర వైద్యం నేర్చుకోవడానికి వచ్చిన ఎమ్.బి.బి.యస్. విద్యార్థుల చేత వాళ్ల పాఠ్యపుస్తకాలు తెప్పించుకుని చదివేవారు. ఆ విధంగా తన అనుభవానికీ, వైద్య శాస్త్రానికి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించేవారు. పంతులుగారిలో ఉన్న మరో లక్షణం నలుగురితో కలసి పనిచేయడం. ఆయనలో ఒంటెత్తు పోకడ లేదు. సమష్టి కృషిలో నమ్మకం ఎక్కువ. ఇవాళ చాలా ఆసుపత్రుల్లో కొన్ని క్లిష్టమైన కేసుల్లో డాక్టర్ల బృందాలు కలసి సమష్టిగా వైద్యాన్ని అందిస్తాయి. ఒక వైద్యుడి అనుభవజ్ఞానం ఆ రోగికి లభించడం కంటే, బృందంలోని డాక్టర్లందరి అనుభవజ్ఞానాలు లభించడమే మంచిదనే భావన ఇది. దీనిని పంతులుగారు 1970ల్లోనే అమలు చేశారు. డాక్టర్ రమణరావు, రాజమ్మ, రావిపాటి ప్రసాద్ వంటి యువ వైద్యులతో బృందాన్ని ఏర్పరచి ముఖ్యమైన కేసుల్లో రోగులకు వైద్యాన్ని అందించేవారు. తద్వారా మెరుగైన ఫలితాల్ని సాధించగలిగారు. పంతులుగారు గొప్ప మోటివేటర్. మంచి కౌన్సిలర్. ప్రగతి దిశగా ప్రయాణించేలా ఇతరులకు ప్రేరణ అందించేవారు. ఆయన మంచి సలహాలు ఇవ్వడంలో చాలా ప్రసిద్ధులు. వందలాది మంది ఆయన సలహాలు తీసుకుని తమ జీవితాల్ని మెరుగు పరచుకున్నారు. వివిధ రకాలుగా, ఆయన వ్యక్తిత్వం వేలాది మందిని ప్రభావితం చేసింది. ఎందరికో స్ఫూర్తినిచ్చింది.

# 'బంగారు స్నేహం'

'తొంభై ఏళ్ల జీవితంలో మీ ఆప్త మిత్రుడెవరు?'– అని పంతులు గారిని అడిగితే వెంటనే చెప్పారు 'బంగారు'. – ఆ పేరు చెబుతున్నపుడు ఆయన కళ్లల్లో మెరుపు. చెన్నంశెట్టి బంగారు పంతులుగారికి హయ్యర్ ఎలిమెంటరీ స్కూలు నుంచి సహాధ్యాయి. అప్పటి నుంచి బంగారు చనిపోయేదాకా ఆ స్నేహం కొనసాగింది. 'నా జీవితంలో వాడే నా ఆప్త మిత్రుడు. ఏ విషయమైనా వాడికే చెబుతాను. బాధ అయినా ఆనందమయినా' – అన్నారు పంతులుగారు.

బంగారు కమ్మకులస్థుడు కాకపోవడంతో ఒంగోలులో ఉన్న కమ్మ వసతి గృహంలో చేర్చుకోలేదు. అప్పుడు పంతులుగారు యాజమాన్యాన్ని ఒప్పించి బంగారును చేర్పించాడు. బంగారుకు కోపమెక్కువ. అందువల్ల వసతిగృహంలో ఉన్నపుడు ఇద్దరూ కొట్టుకునే వారు. బంగారు కొంచెం బలిష్టుడు కావడంతో పిడికిలి బిగించి, పళ్లు కొరుకుతూ పంతులు గారిని డొక్కలో కుమ్మేవాడు. ఆ తర్వాత ఇద్దరూ నిశ్శబ్దంగా పడుకునేవాళ్లు. భోజనం వేళకి బంగారే మొదట మాట్లాడించేవాడు. 'రేయ్ భోజనానికి వేళయింది వెళ్దాం పద' అని లేపేవాడు. ఏమీ జరగనట్టే ఇద్దరూ వెళ్లే వారు.

ఏ అవసరం వచ్చినా, ఇద్దరూ ఒకరికోసం ఒకరు నిలబడేవాళ్లు. పంతులుగారి



పెద్దమ్మాయి అలివేలమ్మకి ఆరోగ్యం బాగా లేనపుడు చికిత్స కోసం వెల్లూరుకు తీసుకు వెళ్లడానికి డబ్బు తక్షణం అవసరమైతే బంగారు భార్య వరలక్ష్మి ముందుకొచ్చింది. ఏ బంధుత్వమూ లేకపోయినా తన నగలు తాకట్టు పెట్టి మరీ డబ్బు ఇచ్చింది. ఇంకోసారి బంగారు దగ్గర అప్పు తీసుకొన్న వ్యక్తి ఎగ్గొడితే, వేరే మార్గం లేక బంగారు కోర్టుకెళ్లాడు. అప్పుడు ప్రధాన సాక్షిగా పంతులు గారే కోర్టులో బంగారు తరుపున సాక్ష్యం చెప్పారు. ప్రతివాది పంతులుగారి బంధువు. అయినా బంగారు వైపు నిలబడ్డారు పంతులు. విధిలేకనే అయినా, పంతులుగారిని బోనెక్కించానే అని బాధపడేవారు బంగారు. ఇలా ప్రతి విషయంలోనూ వాళ్లిద్దరూ ఒకరి కోసం ఒకరు నిలబడ్డారు. చివరికి బంగారు మరణం మాత్రమే వారిని విడదీసింది. బంగారే కాదు – వాళ్ల కుటుంబాలు కూడా కలిసిపోయాయి. స్నేహం బంధుత్వంలా ఉండేది. పంతులుగారి పిల్లలంతా 'బంగారు మామా' అనే పిలిచేవాళ్లు. ఇప్పటికీ రెండు కుటుంబాల మధ్య స్నేహం చెక్కుచెదరలేదు. పంతులు–బంగారుల స్నేహం అపురూపమైంది.

# వసుధైక కుటుంబీకుడు

పంతులుగారు వసుధైక కుటుంబీకుడు. ఆయనెప్పుడూ 'తనకోసమే తను'గా బతకలేదు. తన వ్యక్తిగత ప్రయోజనాల కన్నా, కుటుంబ ప్రయోజనాలకూ, సామాజిక ప్రయోజనాలకూ ప్రాధాన్యతనిచ్చారు. తన జీవితం ద్వారా, ఆచరణ ద్వారా ఆయన సమాజానికి ఉపయోగపడ్డారు. 'సమాజం నుంచి తిరిగి సమాజానికి' అనే భావన ఆయన నరనరానా జీర్ణించుకుపోయింది. అదే ఆయన మాటల్లో, చేతల్లో, ఆలోచనల్లో ప్రస్ఫుటించేది. సమాజానికి ఆయన అందించిన సేవల్ని మూడు రకాలుగా చెప్పుకోవచ్చు.



**కొత్త ప్రపంచానికి ద్వారం**

ఆయన తన కుటుంబం, బంధువులు, గ్రామస్థుల్లో, తెలిసిన వారిలో చాలా మందిని ఆధునీకరించారు. తన వంశంలో, గ్రామంలో మొదటి సారిగా డిగ్రీలోకి అడుగుపెట్టిన వ్యక్తిగా ఆయన ఒంగోలు వచ్చి స్థిరపడ్డారు. మన్నం వారిలో అలా పట్టణంలో స్థిరపడ్డ మొదటి వ్యక్తి ఆయనే. అందువల్ల పంతులు గారు తమ విస్తృత కుటుంబంలో ఎంతో మంది చదువుకోడానికి, నగరాల్లోకి ప్రవేశించడానికి దోహదపడ్డారు. తద్వారా వారంతా ఆధునికతను అందిపుచ్చుకోగలిగారు. తన పిల్లలూ, తన అన్నదమ్ముల పిల్లలూ, సమీప బంధువుల పిల్లలంతా చదువుకొని దేశ విదేశాలకు విస్తరించగలిగారంటే, దానికి ప్రధాన కారణం పంతులుగారే. ఆయనే లేకుంటే, ఈ క్రమం మొదలు కావడానికి ఇంకో తరం వరకూ వేచి చూడాల్సి వచ్చేదేమో! అందువల్ల ఒక తరం నగరీకరణ, ఆధునీకరణకు పంతులుగారే కారణం.

**వైద్యో నారాయణో హరి:**

పంతులుగారు కృషి చేసిన, శ్వాశించిన ప్రధాన రంగం వైద్యరంగం. ఆయన తొంభై ఏళ్ల

జీవితంలో దాదాపు 55 సం॥లు ఈ రంగంలో చురుకుగా సేవలందించారు.

కాలేజీలకెళ్లి ఆయన వైద్య విద్యను అభ్యసించలేదు. సొంతంగా నేర్చుకున్నారు. అనేకమంది క్వాలిఫైడ్ డాక్టర్ల కన్నా ఆయన చాలా చాలా మంచి వైద్యుడు. ఒంగోలులో, చుట్టుపక్కల పట్టణాలలో ఆయన సమకాలీన వైద్యులు చాలామంది ఆయన దగ్గర వైద్యంలో చాలా పాఠాలు నేర్చుకున్నారు. ఆయనెపుడూ వైద్యాన్ని డబ్బు సంపాదించడం కోసం ఉపయోగించలేదు. దాన్ని వ్యాపారంగానూ చూడలేదు.

పంతులుగారు 18 సం॥ల పాటు కాంపౌండర్‌గా, ఎక్స్‌రే స్పెషలిస్ట్‌గా, ఎనస్తీషియన్‌గా, సర్జన్‌గా, జనరల్ ఫిజీషియన్‌గా బీవీఎల్ నారాయణ ఆసుపత్రిలో పనిచేశారు. 1953 నుంచి 1971 వరకు అక్కడ పనిచేసిన కాలంలో వేలాదిమంది పేదలకు బీవీఎల్ నామమాత్రపు

## పేరమ్మ ప్రేరణ

***ప్రతి వ్యక్తికీ అతని బాల్యం ఓ ఆత్మకథ లాంటిది...***

***– ఆల్డోస్ హగ్జలీ***

కొన్ని చిన్ననాటి జ్ఞాపకాలు చనిపోయే వరకు మనల్ని అంటిపెట్టుకొనే ఉంటాయి. అందుకే ఆ జ్ఞాపకాల్ని మన వ్యక్తిగత సాహిత్యంగా హగ్జలీ చెప్పాడు.

పంతులు గారికి కూడా అలాంటి ఒక బాల్య జ్ఞాపకం ఉంది.

అప్పుడు పంతులుగారి వయస్సు సుమారు తొమ్మిది సంవత్సరాలు. అది రాత్రి. ఇంట్లో పిల్లలూ, పెద్దలూ అంతా కలసి ఒక చోట కూర్చుని భోజనాలు చేస్తున్నారు. ఇంతలో బయట నుంచి 'అమ్మా ఇంత ముద్ద పెట్టండమ్మా' – అనే పిలుపు వినబడింది. అది బిక్షగాడి కేక అని వాళ్లకు అర్థమయింది. భోజనాల సమయం కదా ? ఎవరూ లేవలేదు. కానీ పేరమ్మ లేచి తన కంచంలో ఉన్న వరిగె అన్నాన్ని తీసుకెళ్ళి ఆ బిక్షగాడికి వేసింది. పేరమ్మ పంతులుగారి అక్కయ్య. ఆమెకి కొద్దిగా చిత్త చాంచల్యం ఉంది. అలాంటి ఆవిడ ఆ బిక్షగాడిపట్ల చూపిన దయ, ఉదారత్వం పంతులుగారి పసి మనసులో గాఢంగా నాటుకుపోయాయి.

"మా ఊళ్లో తిట్టే వాళ్లేగానీ, పెట్టేవాళ్లు లేరు. ఇంక భోజనాల సమయంలో ఎవరు పెడతారు? ఆమె మానసికంగా చంచలంగా ఉన్నా, కుయ్ కయ్ మనకుండా లేచివెళ్లి వాడికి పెట్టింది. ఆమే నా ఆదర్శం. పేదలకు సహాయం చేయాలనే కోరిక నాకు ఆమె వల్లే కలిగింది" – ఇది పంతులుగారు తన 90వ ఏట చెప్పిన మాటలు

9 ఏళ్ల వయసులో జరిగిన ఈ సంఘటన 90 ఏళ్ల వయసులో కూడా ఆయన జ్ఞాపకంలో స్పష్టంగానే ఉంది. పేరమ్మ తర్వాత పేదలకు సేవచేసే విషయంలో పంతులుగారికి డాక్టర్ బీవీఎల్ నారాయణ కూడా స్ఫూర్తిగా నిలిచారు.

రుసుంతో లేదా ఉచితంగా వైద్యం చేశారు. నిజానికి ఈ కాలంలో పెద్ద మొత్తంలో రుసుం తీసుకొని వైద్యం చేసే డాక్టర్లు ఒంగోలులో కూడా ఉన్నారు. అయితే అందుకు భిన్నంగా నామ మాత్ర రుసుం లేదా ఉచితంగా వైద్యం అందించాలని డా॥ బీవీఎల్ నారాయణ భావించారు. ఈ ఆదర్శాల్ని ఆచరణలో పెట్టేందుకు పంతులుగారు చాలా కృషి చేశారు.

1971లో సుజాత నర్సింగ్‌హోం ప్రారంభించాక బీవీఎల్ నారాయణ ఆసుపత్రిలో ఆచరించిన స్ఫూర్తినే ఇక్కడ కూడా పంతులుగారు కొనసాగించారు. లింగమగుంట, పరిసర గ్రామీణ ప్రజలు, ఇస్లాంపేట, ఇతర బస్తీవాసులు ఆయన ఆసుపత్రికి ఎక్కువగా వచ్చేవాళ్లు.






వారందరికీ ఆయన వైద్య సేవల్ని అందించారు. ఎవరు ఆసుపత్రికి వచ్చినా, ముందు వైద్యం చేసేవారు. ఆ తర్వాత వారు ఇవ్వగలిగిన రుసుం ఇచ్చేవారు. కొంతమంది 'అప్పు' పెట్టడమో, లేదా ఇవ్వలేమని చెప్పడమో జరిగేది. ఆయన జీవితకాలంలో రుసుం ఇవ్వలేదని ఒక్క రోగికి కూడా వైద్యాన్ని నిరాకరించలేదు. పైగా ఉచితంగా మందులు కూడా ఇచ్చేవారు.

రోగుల పట్ల, తన వృత్తి అయిన వైద్యం పట్ల పంతులుగారి నిబద్ధత అసాధారణమైంది. ఇస్లాంపేటలో ముస్లింలు ఇప్పటికీ ఆయనను ప్రేమ, కృతజ్ఞత, గౌరవాలతో గుర్తుచేసుకుంటారు. వేలాది ప్రసవాలు, సున్తీలు చేశారు. వాళ్లకు వైద్యం చేయడంతో పాటు, ఆరోగ్య భద్రతకు సంబంధించిన అనేక సలహాలు, సూచనలనూ ఇచ్చేవారు. ఏ సమస్య వచ్చినా పంతులుగారు ఉన్నారనే భరోసా ఉండేది వాళ్లకి.

అప్పట్లో పంతులుగారు ఒంగోలులోనే మంచి బ్లీడర్. ఆ రోజుల్లో రక్త నిధి కేంద్రాలు లేవు. అందువల్ల అప్పటికప్పుడు రక్తాన్ని తీసి ఇవ్వాలి. చాలామంది డాక్టర్లకు పంతులుగారు ఈ విషయంలో సహాయపడేవారు. తన జీవితకాలంలో తన పరిధిలో ఉన్న గ్రామీణ, పట్టణ పేదల ఆరోగ్య భద్రతను పరిరక్షించడానికి పంతులుగారు ఎనలేని కృషిచేశారు.

ఇవే కాకుండా పంతులుగారు లింగమగుంట గ్రామంలో మన్నం అలివేలమ్మ పేరుతో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి ఇచ్చారు. ఇది జన్మభూమి పథకం కింద ప్రభుత్వ సహకారంతో ప్రారంభించారు.

పంతులుగారి అబ్బాయి డాక్టర్ గోపీచంద్ కూడా నాన్నగారి ఆశయాలకు అనుగుణంగా 1996 నుంచి ప్రతినెలా చివరి శనివారం ఒంగోలులోని పంతులుగారి ఇంటికొచ్చి గుండె సంబంధమైన జబ్బుల రోగులకు నామమాత్రపు రుసుంతో వైద్యం చేస్తున్నారు. 'మన్నం అలివేలమ్మ హార్ట్ క్లినిక్' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నడుస్తోంది.



# శ్రీకృష్ణుడి కన్నా రోగి గొప్పవాడు
# భగవద్గీత కన్నా వైద్య వృత్తి ధర్మం గొప్పది

*"Common sense in an uncommon degree is what the world calls wisdom"*

***- S T Coleridge.***

వివేకం (Wisdom) స్థాయిలోకి వెళ్లిన ఒక అసాధారణ కామన్‌సెన్స్ ఉంది పంతులు గారిలో. దీనికి ఒక ఉదాహరణ ఈ సంఘటన.

ఒకసారి పంతులు గారికి జబ్బు చేసింది. ఆయన భార్య సుబ్బమ్మ జబ్బును నయం చేయమని దేవుడికి మొక్కుకుంది. ఆ మొక్కు తీర్చడం కోసం బీవీఎల్ నారాయణతో కలసి పంతులుగారి కుటుంబం రామేశ్వరం వెళ్లారు. అక్కడ పంతులుగారు ఒక భగవద్గీత, నారబట్టలు కొన్నారు.

తిరిగి వచ్చాక ప్రతిరోజూ ఉదయం పంతులుగారు నారబట్టలు ధరించి పూజగదిలో కూర్చుని భగవద్గీత చదివేవారు. అదే సమయానికి ఆసుపత్రిలో రోగులకు ఏదో అత్యవసరమై ఆసుపత్రికి ఉన్నపళంగా రమ్మని పిలుపు వచ్చేది. అందువల్ల భగవద్గీత పఠనానికి అంతరాయం కలిగేది. మధ్యలో ఆపేసి ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇదే సమయంలో భగవద్గీతలోని ఒక శ్లోకం ఆయన్ని ఆకర్షించింది.

అది గీతలోని రెండవ అధ్యాయం 'జ్ఞానయోగం' లోని 47వ శ్లోకం.

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన

మా కర్మ ఫలహేతుర్భూమాతే సంగో కర్మణీ.

అంటే, నీ కర్మ (Duty) ను నువ్వు చేయి. ఫలితాన్ని నాకు విడిచిపెట్టు.

ఈ శ్లోకం అర్థమయ్యాక ఆయన భగవద్గీతను చదవటం ఆపేశారు. ఆ శ్లోకానికి తన కామన్‌సెన్స్‌ను అన్వయించుకున్నారు. మొత్తం గీతాసారం ఆయనకు ఆ శ్లోకంలో కనిపించింది. 'నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు, నేను నీ వెనక ఉండి, నీకు సహాయం చేస్తాను' అని శ్రీకృష్ణుడు చెబుతున్నట్టుగా ఆయన అర్థం చేసుకున్నారు. తన కర్తవ్యం ఏమిటి? ఆసుపత్రిలో రోగులకు వైద్యం చేయడం. తన పని బాగా చేయడానికి భగవద్గీత పఠనం అడ్డొస్తోంది. 'భగవద్గీత కన్నా వైద్యం గొప్పది, శ్రీకృష్ణుడి కన్నా రోగి గొప్పవాడు' – అని ఆయన గ్రహించారు. అలా ఓ అద్భుత తాత్విక చింతన, వృత్తిలో మరింత మమేకం కావడానికి ఆయనకు భగవద్గీత సహాయపడింది.

# చదువుకు తోడు

మనిషి జీవితంలో విద్యకు ఉన్న విలువ ఆయనకు తెలిసినట్టుగా మరెవరీ తెలియదేమో! ఆయన దృష్టిలో విద్య అంటే పవర్. మనిషి సాధికారికతకు (Empoverment) విద్య దోహదం చేస్తుందని ఆయన నమ్మకం. చదువు లేకపోతే పంతులుగారు పంతులుగారిలా ఉండేవారు కాదు. అజ్ఞానం, దారిద్ర్యం, వెనుకబాటుతనం వంటి అనేక విషయాల నుంచి మనిషికి చదువొక్కటే విముక్తి కలిగిస్తుందని ఆయన నమ్మారు. అందుకే చదువుకోవడానికి ఎవరు ముందుకు వచ్చినా ప్రోత్సహించే వారు, అవసరమైన సహాయం చేసేవారు. పిల్లల్ని బాగా చదివించాల్సిన అవసరం గురించి తల్లిదండ్రులకు చెప్పేవారు. బాగా చదువుకోవాల్సిన అవసరం గురించి పిల్లలకూ బోధించేవారు. చాలామందిని స్వయంగా చదివించారు. కనీసం వందమందికి పైగా విద్య నేర్చుకోవడానికి ఆయన ప్రత్యక్షంగా, పరోక్షంగా సాయపడ్డారు. ఆయన దగ్గరే ఉండి చదువుకొన్న కొంత మంది మనోభావాలివి చూద్దాం.

## 27 ఏళ్లు ఉచిత విద్యుత్ ఇచ్చారు



మన్సూర్

పంతులుగారు నాకు ఏడేళ్ల వయసు నుంచి తెలుసు. పేదలు చికిత్స కోసం వస్తే డబ్బులు ఆశించేవారు కాదు. ఆ రోజుల్లో సాధారణంగా డాక్టర్లు అందరూ రూ. 2 ఫీజు తీసుకునేవారు. పంతులుగారు మాత్రం రూపాయికే వైద్యం చేసేవారు. నేడు ఇస్లాంపేటలో ఉన్న నాలాంటి వయసున్నవారంతా నాడు పంతులుగారి ఆస్పత్రిలో పుట్టినవారే. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే రిక్షా కోసం డబ్బులు ఖర్చవుతాయేమో కానీ, ఆయన దగ్గర పూర్తి ఉచితంగా వైద్యం లభించినట్లే. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా ఉచితంగా చేసేవారు. నేను షాపు పెట్టుకుని 27 ఏళ్లయింది. ఓ సారి అగ్నిప్రమాదంలో వైర్లన్నీ కాలిపోయాయి. మా దగ్గర నుంచి వైరు లాక్కుని కరెంటు పెట్టుకోమన్నారు నరసింహం పంతులుగారు. నేను డబ్బులివ్వబోతే తిరస్కరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. నా దగ్గర కుట్టించిన దుస్తులకు కూడా అందరికంటే ఎక్కువ డబ్బులే ఇచ్చేవారు. ఆయన మాత్రలు కూడా చాలా మంచివి రాస్తారు. మా పిల్లలకు కూడా వైద్యం ఆయనవద్దే చేయించాం.


## పంతులు గారు ప్రయోగశీలి



కోటేశ్వరరావు

పంతులుగారితో నాకు 50 ఏళ్ల అనుబంధం. నేను, ఆయన కలిసి బీవీఎల్ ఆస్పత్రిలో కలిసి పనిచేశాం. అక్కడ మానేసిన తర్వాత ఇద్దరం వేర్వేరు చోట్ల ప్రాక్టీస్ ప్రారంభించాం. ఇద్దరం కలిసి ఓ ఎక్స్‌రే ల్యాబ్ పెట్టాం. ప్రకాశం జిల్లాలో ప్రైవేటు రంగంలో అదే తొలి ల్యాబ్. రోజూ యాభై ఎక్స్‌రేలు తీసేవాళ్లం. పంతులుగారు నిరంతర ప్రయోగశీలి.

నాకు నర్సింహం పంతులుగారు చిన్నాన్న అవుతారు. అప్పట్లో రోడ్లు లేకపోవడం వల్ల నేను వాళ్లింట్లోనే ఉండి 8, 9, 10 తరగతులు చదివాను. భోజన వసతి సౌకర్యాలన్నీ వారే చూసేవారు. బీవీఎల్ ఆస్పత్రిలో పనిచేస్తుండగా డాక్టరు గారు ఆయన్ను 'పంతులు' అని పిలిచేవారు. తర్వాత నర్సింహం పేరు మాయమైపోయి పంతులు పేరు స్థిరపడిపోయింది. చుట్టుపక్కల ఊళ్లలో కూడా నర్సింహం అంటే ఎవరికీ తెలియదు. పంతులుగారు అంటే ఇట్టే గుర్తుపడతారు.



**సోమయ్య, నర్సాయిపాలెం**

## మూడుతరాలకు మార్గదర్శి

మా తాతయ్య ఇమాం మాస్టారు కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తున్న కాలంలో నర్సింహం గారితో పరిచయం. మా తాతగారికి పంతులు గారు చాలా విషయాల్లో సలహాలు ఇచ్చి జీవితంలో పైకి రావడానికి సాయం చేశారు. మా నాన్న వలీ గారినీ ఆయన సొంత కొడుకులా పెంచారు. మా నాన్న పంతులుగారి ఇంట్లోనే పెరిగారు. ఆయన చదువంతా నరసింహం గారి ఆధ్వర్యంలోనే సాగింది. రాయుడుగారు, మా నాన్న మంచి దోస్తులు. మా నాన్నగారి చేత పంతులుగారు తన ఆసుపత్రిలోనే మందులకొట్టు పెట్టించారు. తర్వాత ఆర్‌టీసీలో ఉద్యోగం ఇప్పించారు. మా నాన్న ఒకమాట చెప్పేవారు... పంతులు గారి ఇంట్లో ఎప్పుడూ ఒక వ్యక్తికి సరిపడా భోజనం అధికంగా ఉండేదట.. అది రాత్రయినా, పగలయినా. నాకు ఊహ తెలిసిన దగ్గరి నుంచి చూస్తున్నా... వాళ్లింట్లో ఎప్పుడూ ఎవరో ఒకరు ఉండి చదువుకుంటుండేవారు. నేను చేసే పనులన్నీ ఆయనకు చెబుతుండేవాడిని. మంచి సలహాలు ఇచ్చేవారు. నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నానంటే అందుకు 100 శాతం కారణం నర్సింహం తాతయ్యగారే.



**ఖరీముల్లా ఖాదర్ (వలీ కుమారుడు)**

## అమ్మానాన్నల కన్నా ఎక్కువ

సొంత కూతురికన్నా మిన్నగా నన్ను చూసుకున్నారు. నేను ఒకటో తరగతి నుంచి పెళ్లయ్యే దాకా పెదనాన్న గారి ఇంట్లోనే ఉండి చదువుకున్నాను. మా తమ్ముడు కూడా ఇక్కడే ఉండేవాడు. ఇప్పటికీ మా అమ్మ వాళ్లతో చెప్పలేని విషయాలేమైనా ఉంటే ముందు పెద్దనాన్న గారికో, పెద్దమ్మకో చెబుతాను.



**మాధవి పంతులుగారి సోదరుని కుమార్తె:**

### ఆత్మబంధువు



సురేష్ కొండ,
వింజమూరు, నెల్లూరు

మా బంధువులు తాతయ్యగారి దగ్గర చికిత్స కోసం వచ్చేవారు. అలా వాళ్ల ద్వారా తాతగారితో పరిచయం. 5వ తరగతి నుంచి ఇంజినీరింగ్ వరకు వారి ఇంట్లో ఉండే చదువుకున్నా. ఎంత సంపాదించామన్నది కాదు సాటివారికి ఎంత సాయం చేస్తున్నామన్నది ముఖ్యమని చెప్పేవారు.

### వైద్యులకే గురువు



శ్రీనివాస ప్రభు

మా నాన్నగారు, నరసింహంగారు చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. నేను డిగ్రీ చదివే వరకూ వాళ్ల బంధువులమనే విషయమే తెలియదు. కానీ అంతకు మిన్నగా చూసేవారు. పిల్లల్తో ఉన్నప్పుడు వారిలో కలిసిపోయి ఆడేవారు. చాలా సరదాగా ఉండేవారు. బీఎస్సీ మాత్రమే చదివినప్పటికీ మొదటితరం డాక్టర్లయిన బీవీఎల్, గురవయ్య గారి తర్వాత వైద్యులంతా ఆయనను గురువులా భావించేవారు. ఎందరో ఆయన దగ్గర మెలకువలు నేర్చుకున్నారు. 'పంతులు గారింట్లో పప్పుచారు' అని ఒక నానుడి ఉండేది. అంటే ఒంగోలులో ఆయనింట్లో భోజనం చేయని వారు లేరనడం అతిశయోక్తి కాదు.



నేను 10వ తరగతిలో ఉండగా 2008లో ఇక్కడకు వచ్చాను. వాళ్ల మనవళ్లను ఎలా చూసేవారో నన్నూ అలాగే చూసుకునేవారు. ఆయన నా పట్ల చూపిన ప్రేమ, ఆదరణ మరచిపోలేను.

**- వేల్పురి సాయినాథ్**

గోపాల్ నరసింహం గారి ఇంట్లో పనికి వచ్చాడు. కానీ నరసింహం పంతులు అతన్ని చదివించారు. ఫలితంగా అతను ఇప్పుడు స్వతంత్రంగా బతుకుతున్నాడు. గోపాల్ ద్వారా పనిలోకి వచ్చిన సురేష్‌నూ పంతులుగారు ప్రోత్సహించి చదివించారు. అతనికి మార్గదర్శనం చేసి ఇంజనీరింగ్ చదివించారు. ఇప్పుడు సురేష్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నరసింహం వాళ్ల అన్న రామస్వామి కొడుకు అంజయ్య కూడా ఆయన ఇంట్లోనే ఉండి చదువుకున్నాడు. విశ్వనాథం, రాజేష్, మాధవి వంటి ఎంతో మంది పంతులుగారి ఆశ్రయం పొంది చదువుకున్నవారే. చివరి దశలో తన సాయం కోసం వచ్చిన సాయి అనే కుర్రాడినీ చదువుకోమని

ప్రోత్సహించారు. సాయి భవిష్యత్తు కోసం కొంత డబ్బు కూడా దాచారు.

పంతులుగారు తను జీవించి ఉన్నప్పుడు సమాజానికి ఎంతగానో ఉపయోగపడ్డారు. తన మరణాన్నీ అంతే అర్థవంతంగా మలచుకున్నారు. తన శరీరం వృథాగా కాలి బూడిదకావడం ఆయనకు ఇష్టంలేదు. జీవితాంతం ఏ రంగానికి పనిచేశారో, ఆ వైద్య రంగానికే తన శరీరం ఉపయోగపడాలని ఆయన నిర్ణయించుకున్నారు. తన దేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వైద్య కళాశాలకు అప్పగించాల్సిందిగా వీలునామా రాశారు. విద్యార్థులు ఆయన దేహాన్ని ముక్కలుగా చేసి కనీసం ఆరు నెలలపాటు పరీక్షిస్తారని తెలిసినా, సంప్రదాయ బద్ధంగా చేయాల్సిన అంతిమ సంస్కారాల్ని నిర్వహించలేమని తెలిసినా, పంతులుగారి కుటుంబ సభ్యులు ఆయన కోరికను మన్నించి ఆయన దేహాన్ని ఒంగోలులోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు (రిమ్స్) అప్పగించారు. పంతులుగారు తన జీవితాన్ని, మరణాన్ని సమాజానికే అంకితం చేసిన గొప్ప వ్యక్తి. అందరికీ మార్గదర్శి.

## మెడిసిన్ చదవకపోయినా...



నాన్నగారు మొదట్లో వ్యవసాయం చేసేవారు. మాది మధ్య తరగతి కుటుంబం. 1985లో చీమకుర్తిలో మా పొలాలు అమ్మేసి ప్రస్తుతం ఉంటున్న ఇంటి స్థలం కొన్నారు. వ్యవసాయం మిగిల్చిన అప్పులు కొన్ని తీర్చేసి సోదరి సుజాత పెళ్లి చేశారు. ఆ తర్వాత గోపీచంద్, పద్మజల పెళ్లిళ్లు 1987లో ఒకేసారి జరిగాయి. అప్పుడే అప్పులన్నీ తీర్చేసి ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. నేను, తమ్ముడు ఉద్యోగాల్లో చేరాం. ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా మా ఇంట్లో ఎప్పుడూ 15 మందికి తక్కువ ఉండేవారు కాదు. ఏ సందర్భంలోనూ మా ఇంటికి వచ్చేవారు భారంగా అనిపించలేదు. వైద్య శాస్త్రం చదవకపోయినా వైద్యులు చేసే పనులన్నీ జాగ్రతగా నేర్చుకున్నారు. వైద్యులు పక్కనుండగా శస్త్రచికిత్సలు కూడా చేసేవారు. నాన్నగారు ప్రారంభించిన సుజాత నర్సింగ్‌హోంలో కార్పొరేట్ హంగులు లేకపోయినా పేదలకు అవసరమైన నాణ్యమైన వైద్యం చేసేవారు. వాళ్లు ఇచ్చింది పుచ్చుకోవడం తప్ప కచ్చితంగా ఇంత ఇవ్వాల్సిందే అని ఎవర్నీ బలవంతపెట్టలేదు. తొమ్మిది దశాబ్దాల నాన్నగారి జీవన యానంలో ఏదీ కూడా ప్రణాళిక ప్రకారం జరగలేదు. డిగ్రీ చేయడం, వైద్యునిగా తర్ఫీదు, ఆస్పత్రి ఏర్పాటు.. అన్నీ అలా అనుకోకుండానే జరిగిపోయాయి. నాన్నగారి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందేమిటంటే ఆయన చాలా సరదాగా ఉండేవారు. ఏ వయసు పిల్లలతో ఎలా ఉండాలో అలానే వ్యవహరించేవారు.

**- రాయుడు**

# పిల్లలంటే చెప్పలేనంత ఇష్టం



ఇంట్లో నన్ను కన్న కూతురిలా చూసేవారు. మా ఇంట్లో చాలా మంది బంధువుల పిల్లలను ఉంచి చదివించేవారు. చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన వారిని చాలా ప్రేమగా చూసేవారు. ఎంతోమందికి ఉచితంగా రోగాలను నయం చేశారు. మందులు కూడా ఇచ్చేవారు. ఆయన దగ్గరికి ముస్లింలు అధికంగా వచ్చేవారు. ఇంట్లో ఎన్ని ఆర్థిక సమస్యలున్నా ఎప్పుడూ బయటకు అలా కనిపించేవారు కాదు. ఎవరికీ చెప్పేవారు కాదు.

మామయ్యగారికి ప్రయాణం చేయడం అసలు ఇష్టం ఉండదు. నాకు తెలిసి 2005 వరకు ఆయన ఈ ఊరు వదిలి పక్క ఊరికి కూడా వెళ్లేవారు కాదు. కారులో వెళ్లాలన్నా ఇష్టపడేవారు కాదు. చివరికి మా పెళ్లి తిరుపతిలో జరిగితే దానికి కూడా ఆయన రాలేదు. ప్రయాణాలంటే ఆయనకు ఎందుకో అంత భయం. ఆస్పత్రిలో రోగులకు శస్త్ర చికిత్సలు చేసినపుడు మాత్రం అదేమీ ఉండేది కాదు.

ఎప్పుడూ సాటివారికి సాయం చేయాలనే స్వభావం. ఒంటరితనం ఆయనకు అసలు నచ్చదు. ఎప్పుడు ఎవరో ఒకరు తోడుండాలి. తనకు నచ్చితే వారు పేదవాళ్లా, బంధువులా, మన కులం వాళ్లా అని పట్టించుకునేవారు కాదు. ఎలాంటి సాయమైనా చేసేవారు. మా బంధువుల్లో ఎవరికైనా కష్టం వస్తే మొదట మామయ్య గారి దగ్గరికే వచ్చేవారు.

పుస్తకాలు చదవటం కూడా మాకు ఆయన నుంచి అలవాటు అయింది. ఈ పుస్తకం బాగుంది. ఇందులో ఈ విషయాలున్నాయని చెప్పేవారు పిల్లల్ని చాలా ప్రేమగా చూసేవారు. మనవళ్లే కాదు పసిపిల్లలు ఎవరైనా ఆయనకు వల్లిమాలిన ప్రేమ.

**- వైదేహి**

## అందరూ ఆయన పిల్లలే!



**ఎలమంద**

నర్సింహంగారు మా మేనత్త భర్త. ఆయన ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా, మిగతా వారి వద్ద 2 రూపాయలు ఫీజు మాత్రమే తీసుకునేవారు. ఎస్సీ, ఎస్టీలందరికీ డబ్బు లేకుండా వైద్యం చేసేవారు. నేను 3 సంవత్సరాలు, ఆ తర్వాత మా అన్నయ్య కొంతకాలం వారింట్లోనే ఉండి చదువుకున్నాం. ఇల్లంతా ఎప్పుడూ పిల్లలతో సందడిగా ఉండేది. సొంత పిల్లల్లా చూసుకునేవారు.

## దార్శనికుడు



నాకు ఊహ తెలిసి మా ఐదుగురినీ ఆయన ఎప్పుడూ కొట్టలేదు. కనీసం పరుషంగా కూడా మాట్లాడలేదు. పిల్లల్ని డాక్టర్లను చేయాలని ఆయనకు చాలా కోరికగా ఉండేది. మా ఇల్లు రైల్వే స్టేషన్‌కు దగ్గరగా ఉండేది. ఒకరోజు ఆయన రైల్వే స్టేషన్‌కు వెళ్లి 20-30 ఇడ్లీలు, ఉప్మా తీసుకొచ్చి పొద్దున 6 గంటలకే పిల్లలకు పెట్టారు. ఇది నాకు బాగా గుర్తుండిపోయిన సంఘటన. ఇంట్లో ఎప్పుడూ చాలామంది పిల్లలు ఉండేవారు. నేను మొదటిసారి మెడికల్ ప్రవేశ పరీక్షలో సీటు సంపాదించలేకపోయినప్పుడు ఏమీ అనలేదు. కానీ 6 నెలల తర్వాత సున్నితంగా కోప్పడ్డారు. అప్పుడు బాగా కష్టపడి మెడిసిన్ చదివాను. మా చదువులకు ఎప్పుడూ ఆర్థిక ఇబ్బంది లేకుండా చూసేవారు. నేను ఎంబీబీఎస్ 3 సంవత్సరంలో ఉండగా నాతో శస్త్ర చికిత్స చేయించారు. అలా సర్జన్ తప్ప వేరే కాకూడదని బలమైన కోరిక నాలో అప్పుడే నాటుకుపోయింది. నేను ఎంబీబీఎస్ చదివి చేయలేనివి కూడా నాన్నగారు నా పుస్తకాలు చదివి చేసేవారు. ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు చేతులెత్తేసిన తర్వాత ఓ బిడ్డకు చికిత్స చేసి ప్రాణం పోయడం నాకు బాగా గుర్తు. ఎంబీబీఎస్ తర్వాత పై చదువులకు వెళ్తానని గట్టిగా చెప్పినప్పుడూ ఏమీ అనలేదు. పెళ్లి కావాల్సిన ఇద్దరు అమ్మాయిలు ఉన్నా, అప్పులు ఉన్నా మాకున్న మూడెకరాల పొలం అమ్మి నన్ను చదివించారు. దాంతో నా జీవితం పూర్తిగా మారిపోయింది. ఇంగ్లండ్ వెళ్లడం, సర్జరీలో మెలకువలు నేర్చుకోవడం జరిగింది. మా అక్కయ్య చనిపోయిన విషాదంతో నేను కచ్చితంగా హార్ట్ సర్జన్ కావాలనుకున్నాను.

నాన్నగారు చాలా ఆత్మవిశ్వాసం గల వ్యక్తి. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా తను అనుకున్నది సాధించారు. ఆయన అన్నదమ్ముల పిల్లలు చాలా మంది జీవితంలో స్థిరపడటానికి సాయపడ్డారు. ఒక తరంలో ఇంటిలో ఒక్కరు చదివినా ఆ కుటుంబం బాగుంటుందని నమ్మేవారు. వృత్తిపట్ల ఆయనకు నిబద్ధత ఎక్కువ. నాకు సమాజం ఏం చేసిందని కాకుండా నేను సమాజానికి ఏం చేశానని ఎప్పుడూ ప్రశ్నించుకునేవారు.

చనిపోవడానికి సంవత్సరం క్రితం తన మృతదేహాన్ని వైద్య విద్యార్థులకు అందజేయమన్నారు. ఆయన సమాజం గురించి ఎంతగా ఆలోచిస్తారో చెప్పడానికి ఇది ఓ చిన్న ఉదాహరణ.

ఇస్లాంపేటలో ఎంతో మంది ముస్లింలు ఇప్పటికీ నిత్యం నాన్న గారిని తలుచుకుంటూ ఉంటారు. ఆ కాలంలో గుంటూరు మెడికల్ కాలేజీలో మాత్రమే చేయగలిగే ఆపరేషన్లు

కూడా అవలీలగా చేసేవారు. ఆయనకు ఆంగ్లంలో పట్టుంది కాబట్టి వీలైనప్పుడు మెడికల్ జర్నల్స్ చదివి కొత్త సమాచారం తెలుసుకునేవారు. ఏమైనా క్లిష్టమైన సమస్య వస్తే తోటి డాక్టర్లతో కూర్చొని అందరూ కలిసి ఓ నిర్ణయానికి వచ్చేవారు. ఇది నేడు వైద్యరంగంలో వైద్యులు అనుసరిస్తున్నారు. దాన్ని 30 ఏళ్ల కిందటే ఆయన ఆచరించారు.

ఏది చేసినా చిత్తశుద్ధితో చేస్తే అందులో పరిపక్వత తప్పకుండా సాధిస్తారని నమ్మేవారు. విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం, సమాజానికి చేతనైన సాయం చేయడం.. ఇవి మూడు ఆయన నుంచి మనం నేర్చుకోదగిన విషయాలు.

**- డా॥ గోపీచంద్**

**కొడుకుల్లా చూసేవారు**

మాతో చాలా సరదాగా ఉండేవారు. సుడోకు అంటే ఆయనకిష్టం. నేను వచ్చినప్పుడల్లా కొత్తవి తెచ్చేవాణ్ని. నా భార్య సుజాత పేరుపై నర్సింగ్ హోం ప్రారంభించారు. మా పెద్దబ్బాయికి చిన్నప్పుడు కామెర్ల జబ్బు వచ్చింది. అప్పుడు చాలా రోజులు ఇక్కడే ఉన్నాడు. వాడు వాళ్ల అమ్మకంటే ఆయన దగ్గరే ఎక్కువ గడిపేవాడట. ఆయన ఊయల్లో పెట్టి ఊపితేనే నిదప్రోయేవాడట. ఆయనలో ఆత్మ విశ్వాసం చాలా ఎక్కువ. ఏదైనా సాధించాలనుకుంటే అది జరిగిపోవాల్సిందే.

**– శ్యాంసుందర్‌రావు, పెద్దల్లుడు**

1987లో నేను వాళ్ల చిన్నమ్మాయిని పెళ్లి చేసుకున్నాను. ఆయనతో నేను ఎప్పుడు మాట్లాడిన చాలా సరదాగా ఉండేవారు. జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించిన వ్యక్తి. సొంత కొడుకుల్లా అన్ని విషయాల్లో సలహాలు ఇచ్చేవారు. మా పెద్దబ్బాయి పుట్టిన తర్వాత రెండేళ్లు నేను కుటుంబానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో వాడికి వాళ్ల తాతగారితో మంచి అనుబంధం ఏర్పడింది. ఆయన నుంచి నేర్చుకోవాల్సిందే మిటంటే.. జీవితాన్ని తనవితీరా అనుభవించడం. ఆయనలో ఒక చిన్న పిల్లవాడుండేవాడు. అప్పుడప్పుడు పిల్లలతో కలిసి నాట్యం చేసేవారు. ఆయన హస్తవాసి మంచిదనే పేరుండేది. ఆయన చేతుల మీదుగా మందులిస్తే త్వరగా నయమవుతుందని రోగుల నమ్మకం.

**– మధుసూదన రావు, చిన్నల్లుడు**



**కూతుళ్లు-అల్లుళ్లు, మనవళ్లతో నర్సింహం దంపతులు**



దీపావళి (2011) పండుగ సందర్భంగా మన్నం కుటుంబీకులు


# మంచి నేస్తం

పంతులుగారికి జీ, జెన్, అభిజాత్, ప్రశాంత్, అకుల్, ప్రతీక్... ఈ ఆరుగురూ మనవళ్లు, నిఖిత... ఏకైక మనవరాలు.

పంతులుగారు వీరితో ఓ తాతయ్యగానే కాదు... ఆటపాటలతో అలరించే ఓ స్నేహితుడిగా ఉండేవారు. పిల్లలతో మమేకమైపోయేవారు. దీంతో పిల్లలు ఎప్పుడూ పంతులుగారిని వదిలేవారు కాదు. ఆ విధంగా వారి మధ్య విడదీయరాని బంధం ఎంతగానో బలపడింది.

పిల్లలు అమ్మానాన్నలతో చెప్పని విషయాలు కూడా తాతయ్యతో చెప్పేవారు. పంతులుగారిది చాలా సున్నితమైన మనసు. ఆయన ఎప్పుడూ పిల్లలను కోప్పడటం, కొట్టడం మేం చూడలేదు. కానీ ఓసారి ఓ వేడుకలో జెన్ బాగా అల్లరి చేస్తున్నాడు. అది చూసిన పంతులుగారు గట్టిగా కోప్పడ్డారు. కానీ తర్వాత ఎంత బాధపడ్డారో! తర్వాత జెన్‌కి ఫోన్ చేసి క్షమించమన్నారు. అంత పెద్దాయన అలా అడిగారంటే... ఆయన మంచి మనసుని అర్థం చేసుకోవచ్చు.

తన మనవల్లో కొందరైనా డాక్టర్లుగా స్థిరపడాలన్నది ఆయన కోరిక. కానీ ఎంత చనువుగా ఉన్నప్పటికీ... తన అభిప్రాయాలను ఎప్పుడూ పిల్లలపై రుద్దేవారు కాదు. ఏ విషయంలోనూ ఎవ్వరినీ బలవంతపెట్టేవారు కాదు. పిల్లలు డాక్టర్లు కావాలనే ఆయన కోరిక తీరకపోయినా... వారేది కోరుకుంటే అదే చదువుకునేందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని ఎప్పుడూ ఇచ్చేవారు.



తాతయ్య పిల్లలకు పూర్తి స్వేచ్ఛనిచ్చే వారు. వారి అభిప్రాయాలకూ ఎంతో విలువ ఇచ్చేవారు. మాకందరికీ మానవతా విలువలను నేర్పారు. ఒక్కోసారి ఏదైనా ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి రోగులకు సేవలు చేయమనేవారు. ఇది పిల్లల్లో సేవాభావాన్ని పెంపొందించేది. పిల్లలు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో, వాటిని చేరుకోవడంలో ఆయన ప్రోద్బలం చాలా ఉండేది. వైద్యవృత్తి, కుటుంబం... ఈ రెండింటి కోసమే ఆయన ఎప్పుడూ పరితపించేవారు. కుటుంబం సంబంధాలు, అందరితో ప్రేమగా ఉండటంలో కలిగే ఆనందం గురించి పిల్లలకు వివరించేవారు. ఎవరు ఎక్కడున్నా అప్పుడప్పుడూ ఫోన్లో అయినా ఒకరికొకరు

పలకరించుకుంటూ, మాట్లాడుకుంటూ ఉండాలనేవారు.

పిల్లలకు ఏదైనా చెప్పాలంటే తన చిన్ననాటి అనుభవాలను ఉపయోగించి చెప్పేవారు. విజ్ఞాన పరిధిని పెంపొందించుకోవడానికి, ప్రపంచంలో వస్తున్న మార్పులపై అవగాహన కోసం తరగతి పుస్తకాలతోపాటు, సాధారణ పుస్తకాలను కూడా చదవాలని తరచూ చెప్పేవారు.

పంతులుగారితో మాట్లాడటం ఓ గొప్ప అనుభూతి. ఎంతో ఆప్యాయంగా, సరదాగా నవ్విస్తూ మాట్లాడేవారు. ఎవరు ఏది చెప్పినా ఎంతో శ్రద్ధగా వినేవారు. తన అభిప్రాయాన్ని సూటిగా, స్పష్టంగా వ్యక్తంచేసేవారు.

నైతిక విలువలకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు. పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అందరినీ ఒకేలా చూడాలి అని పిల్లలకు చెప్పేవారు. కళలపై ఆసక్తి ఉన్న పిల్లలు కనిపిస్తే ఆయన ఎంతో సంబరపడిపోయేవారు. జీ పెళ్లిలో కొందరు పిల్లలు చేసిన కళాత్మక ప్రదర్శనలు ఆయనకు ఎంతో సంతోషాన్నిచ్చాయి. పిల్లలందరినీ దగ్గరికి పిలిచి భుజం తట్టి అభినందించారు.





పంతులుగారి వద్దకు తమ పిల్లలను అప్పుడప్పుడైనా పంపిస్తే... వారికి మంచి లక్షణాలు అలవడతాయని, ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులుగా తయారవుతారని పంతులుగారి కుమారులు, కుమార్తెలు భావించేవారు.

విదేశాల్లో ఉన్నా సరే... తరచూ తాతగారితో మాట్లాడటం పిల్లలకు ఓ అలవాటు. వారు తమ వయసు పిల్లలతో ఎంత సరదాగా, సంతోషంగా ఉంటారో తాతయ్యతోనూ అంతే సరదాగా ఉంటారు. పంతులుగారు కూడా పిల్లల వయసుకి దిగివచ్చి వారితో గడిపేవారు.

"అమెరికాలో నన్ను చూసిన వాళ్లు, నా ద్వారా తాతయ్య గురించి విన్న వాళ్లు... ఆయన గురించి ఇంకా ఎంతో తెలుసుకోవాలని ఉవ్విళ్లూరేవారు. అది నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించేది. ఎక్కడో ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రజలకు మాత్రమే పరిచయం ఉన్న వ్యక్తిపై అట్లాంటిక్ సముద్రం అవతల ఉన్న ఇక్కడవారు ఆసక్తి కనబరచడం ఏంటా అని. ఇది ఆశ్చర్యం కాదు... మేమెంతో గర్వపడే విషయం".

తర్వాత తరాలకు మీరిచ్చే సందేశం ఏంటి అని ఓ సందర్భంలో తాతయ్యనడిగా. "అందరూ తమ సంపాదనలో కనీసం అయిదు శాతమైనా పేదవారి కోసం వెచ్చించండి" అని చెప్పారు. ఓ మనవడికి తాతయ్య ఇచ్చే సందేశం ఇంతకంటే అద్భుతమైంది ఉంటుందా!!

## ఆయన ప్రభావం అపారం



తనచుట్టూ ఉన్నవారి ఆలోచనలను ప్రభావితం చేయగలిగే శక్తిగా ఎదగడం... ఒక మనిషి సాధించే అతి పెద్ద విజయం. మా తాతయ్య ఈ విషయంలో ఎంతో సఫలమయ్యారని నేను గర్వంగా చెప్పగలను.

మన ప్రవర్తనకు తల్లిదండ్రులు, మన అనుబంధాలకు బంధువులు, ఆలోచనలకు స్నేహితులు, తెలివితేటలకు ఉపాధ్యాయులు కారణమవుతారని సాధారణంగా అందరూ చెబుతుంటారు. మన భవిష్యత్తు వీరి ద్వారానే నిర్ణయమవుతుందంటారు. కానీ ప్రవర్తన, అనుబంధాలు, ఆలోచనలు, తెలివితేటలు... వీటన్నింటినీ మించింది మరొకటుంది. అదే వివేచనాశక్తి. ఇది తాతయ్యలు, బామ్మల నుంచి పిల్లలకు వస్తుందని నా ప్రగాఢ విశ్వాసం. పెద్ద మనవడిని కావడం వల్ల మా తాతయ్య నుంచి ఎంతో ఎక్కువ నేర్చుకునే అవకాశం నాకు కలిగింది.

నాకు బాగా జ్ఞాపకం. ఎన్నో అంశాలపై నేనూ తాతయ్య చాలా సేపు మాట్లాడుకునేవాళ్లం. అందులో కుటుంబ సంబంధ అంశాలే కాదు... ఒక్కోసారి ప్రపంచ రాజకీయాల వరకూ మా చర్చ సాగిపోయేది. ఇవన్నీ నా ఆలోచనలు, పనులు, జీవన విధానంపై ఎంతో ప్రభావం చూపించాయి. ఏది చర్చించినా... చివరికి వ్యక్తిగా సామాజిక బాధ్యతను నెరవేర్చేందుకు మనం ఏం చెయ్యాలో తెలియచెప్పేవారు.

పంతులుగారు తనకు సంబంధించిన మంచి విషయాలను ఎలా చెప్పుకునేవారో... తన అపజయాలను సైతం అంతే నిజాయతీగా వివరించేవారు. నాకు ఈ రకమైన పరిణతి రావడానికి మరో 10 సంవత్సరాలు కావాలేమో! ఈ వైఖరే... ఆయనకు అమెరికాలో సైతం ఎంతోమంది అభిమానులను సంపాదించి పెట్టింది.

ఒకసారి డాక్టర్ బీవీఎల్ నారాయణగారికి, తాతయ్యకి మధ్య ఉన్న విబేధాలపై మాట్లాడుకుంటున్నాం. 'మీ ఇద్దరూ కలిసి ఉండవచ్చు కదా అని కొంతమంది స్నేహితులు నాతో అన్నారు... కానీ నారాయణలాంటి వ్యక్తి నా స్థాయికి దిగి రావడం అంటే అది ఆయనకు అవమానంగా ఉంటుంది. కానీ నేను ఇప్పటికీ నా అభిప్రాయానికి కట్టుబడే ఉన్నాను' అని అన్నారు. కానీ మా సంభాషణలో అసలు వారిద్దరి మధ్య ఎందుకు విబేధాలు వచ్చాయనేది మాత్రం చెప్పలేదు. ఈ సంఘటన చాలు... తాతయ్య ఎదుటివారి అభిప్రాయాలకు సైతం ఎంత విలువనిస్తారో తెలుసుకోవడానికి.

నా జీవిత ప్రతి భాగంలో తాతయ్య ప్రభావం సుస్పష్టం. నా వృత్తి, వ్యక్తిత్వం, బాధ్యతలు, వివాహం, కుటుంబం సంబంధాలు... ఇలా అన్నింట్లో ఆయన ఆలోచనల ప్రభావం కనిపిస్తూనే ఉంటుంది. ఆయన మరణించిన తర్వాత... ఆయన కోసం ఏదైనా చేయాలనే ఆలోచనలతో చాలా సమయం గడిపాను. కానీ చివరికి నాకు అనిపించినదేంటంటే... తాతయ్య చూపించిన మార్గంలో, ఆయన నేర్పిన విలువలతో జీవించడం, మా ముందు తరాలకు వాటిని అందించడమే ఆయనకు మనం ఇవ్వగలిగే గొప్ప నివాళి.

**- జీ**

## ప్రేమ జీవి



తాతగారు లేరన్న నిజం నన్ను చాలా బాధిస్తోంది. ఆయన జ్ఞాపకాలు ఎప్పుడూ నా మనసులో పదిలంగా ఉంటాయి. ఆయనలోని బలం, అందరిపై చూపిన ప్రేమ, మాకోసం పాట పాడినప్పుడు ఆయన స్వరంలో దొర్లిన మాధుర్యం, పిల్లల్ని గద్దించినప్పుడు గొంతులోని గాంభీర్యం... ఇవన్నీ నాకు గుర్తే. తాతయ్య మాలో ఒకరిగా కలిసిపోయేవారు. ఇంట్లో ఆయనే అందరికంటే పెద్ద పిల్లవాడు. అందరినీ మురిపించిన పిల్లవాడు.

ఆయన తరాల అంతరాన్ని మరిపించి కుటుంబ సభ్యులందరినీ సమైక్యంగా ఉంచిన తీరు మరువలేనిది. ఇప్పటికీ ఒంగోలులోని మా ఇంట్లో ప్రతి అంగుళం ఆయన మాటలతో, ఆయన జ్ఞాపకాలతో నిండి ఉంది. ఆ ఇంట్లోనే నేను కుటుంబ భావనను నేర్చుకున్నా. దయ, పంచుకోవడంలో ఉన్న ఆనందం, ఒకరికొకరుగా జీవించడం.. ఇవన్నీ అక్కడే అలవడ్డాయి. మా తాతను, నానమ్మను చూడ్డానికి ఎంతమంది వచ్చేవారో. అలా వచ్చే వాళ్లలో చాలా మంది మా కుటుంబ సభ్యులు కాదు. తాత, నానమ్మలలోని 'మన'తనం అందుకు కారణం. ఎవరొచ్చినా ఇంట్లోకి సాదరంగా ఆహ్వానించేవారు. ఎవరూ పరాయి వాడు కాదు. చివరి శ్వాస వరకూ అదే రీతి.

మా తాత మంచి స్నేహితుడు. ఆయన వద్ద ప్రేమ తత్వమనే గొప్ప సంపద ఉండేది. నాకు తెలిసి ఆ విషయంలో ఆయనను మించిన సంపన్నుడు లేడు. ఆయన ఎన్నో జీవితాల్ని ప్రభావితం చేశారు. ఆయన ఇక లేరని తెలిసి ఎన్నో హృదయాలు చలించిపోయాయి. 'మనవాళ్లు' అనే మనుషుల్ని సంపాదించడం కన్నా జీవితంలో గొప్ప విజయం ఏముంటుంది? మా వంశంలో డిగ్రీ చదివిన తొలి వ్యక్తి ఆయనే. సొంతంగా వైద్యం నేర్చుకొని ఎందరికో కన్నీళ్లు తుడిచారు. చదువు, వ్యవసాయం, ఆటపాటలు, వైద్యం ఏది చేసినా అంకితభావంతో చేశారాయన. 'ఒక గ్రామంలో నివసిస్తూ ఆయన ఇంత సాధించారు. నేనూ సాధించగలను' అన్న నమ్మకం నాకు కలిగేది.

మా తాత తనకు జీవితంలో తారసిల్లిన ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేశారు. ఆయన ఉన్న చోటు శక్తితో నిండిపోయేది. సలహాలు, సూచనలు, హాస్యప్రియత్వం ఇలాంటి గుణాలు ఆయన సొంతం. అందుకే అందరూ ఆయన పట్ల ఆకర్షితులయ్యేవారు. నా జీవితంపై ఎంతో ప్రభావం చూపిన తాతకు మనవరాలిని కావడం నా అదృష్టం. ఆయన నన్ను భుజాల మీద ఎత్తుకొని ఆడించారు. గోరుముద్దలు తినిపించారు. పడుకునే దాకా జోకొట్టేవారు. నాకు కథలు చెప్పారు. నా జీవితంలోని ప్రతి కోణంలో ఆయన ఉన్నారు. ఆయన అనారోగ్యంతో మంచం మీద పడినప్పుడు ఆయనకు అన్నం ముద్దలు తినిపించిన చివరి వ్యక్తిని నేనే. నోట మాట రాని స్థితిలో కూడా ఆప్యాయంగా నా తలపై నిమిరిన ఆయన స్పర్శను ఎన్నటికీ మరిచిపోను. ఆయనకు మనవరాలిని నేనొక్కదాన్నే. అందుకే నాపై అవ్యాజమైన ప్రేమను కురిపించారు. తాతను ఎన్నటికీ మరవలేను. అసలు మా తాత ఈ లోకాన్ని ఎందుకు వదిలి వెళ్లారో అనిపిస్తూంటుంది.

**- నికిత**

# అణువణువునా తాతయ్యే!



జీవితంలోని ప్రతి పార్శ్వంతో ముడిపడి ఉన్న ఓ వ్యక్తి గురించి కొద్దిగా చెప్పాలంటే చాలా కష్టం. ఎక్కడ, ఎలా మొదలుపెట్టాలో కూడా తెలియడం లేదు.

తమ తల్లిదండ్రులంత చెడ్డవాళ్లు ఎవరూ ఉండరు... ఈ భావం పిల్లలందరికీ ఏదో ఒక దశలో కచ్చితంగా కలుగుతుంది. అలాగే మా తాతయ్య చాలా మంచివారు... అనే భావన కూడా అరుదుగానే కలుగుతుంది. కానీ మా తాతయ్య నిజంగానే చాలా మంచివారు.

సెలవుల్లో ఒంగోలు వెళ్లడం మా అందరికీ తప్పనిసరి. అందమైన మా (తాతయ్య) ఇల్లు, 'ఆ ఇంటికి' అని మేమందరం పిలుచుకునే మా మావయ్య అంజయ్యగారి ఇల్లు... మా దృష్టిలో ఒంగోలు అంటే ఇంతే. ఈ రెండిళ్లలో మాపై ప్రేమ, అభిమానాలే కానీ ఎలాంటి హద్దులూ ఉండేవి కాదు. ఎక్కడున్నా, ఎలా తిరిగినా, ఏం ఆడుకున్నా ఎవరూ అడిగేవారు కాదు. బహుశా దీనివల్లే కావచ్చు... మన ఇల్లు, మన వాళ్లు అనే భావన మాలో పెంపొందింది. అనురాగాలు పెరిగాయి. ఇదంతా నరసింహం తాతయ్య వల్లే.

మా తాతయ్య తర్వాత తరం, ఆయనతో పరిచయమున్న వాళ్లు ఉమ్మడి కుటుంబంలో ఉండే మాధుర్యాన్ని నేటికీ అనుభవిస్తున్నారంటే అది ఆయన ఆ రోజు నేర్పిన విలువల వల్లే.

మా ఇద్దరి మధ్య చాలా సరదా సంఘటనలు చోటుచేసుకునేవి. నేను వేసుకునే బట్టల నుంచి చదువు వరకూ ఇద్దరి మధ్యా ఎన్నో భిన్నాభిప్రాయాలు. ఓ స్నేహితుడితో ఎంత స్వతంత్రంగా, చనువుగా మాట్లాడతామో తాతయ్యతోనూ అలాగే మాట్లాడే స్వేచ్ఛ మాకు ఎప్పుడూ ఉండేది. తన సొంత అనుభవాల నుంచి చెప్పే విషయాలు మాకెంతో స్ఫూర్తినిచ్చేవి. అవన్నీ ఇప్పటికీ మా మదిలో మెదులుతూనే ఉంటాయి.

నేను ఇంటర్మీడియట్ చదువుకునే సమయంలో ఆరు నెలలపాటు తాతయ్యతో గడిపే అదృష్టం దక్కింది. మా అన్నదమ్ముల్లో ఎవరికీ దక్కని భాగ్యమిది. అవి నా జీవితంలో మరచిపోలేని రోజులు. ఆయన గుండెలపై పడుకొని, కొన్నిసార్లు అర్థరాత్రి 3 గంటల వరకూ, మాట్లాడుకున్న మాటలు ఇప్పటికీ గుర్తొస్తూనే ఉంటాయి. వయసులో ఆయన పెద్దవారు కావచ్చు... కానీ మా మధ్య చర్చలకు అది ఎప్పుడూ అడ్డు కాలేదు. అన్నిరకాల విషయాలపై మేం మాట్లాడుకునేవాళ్లం. ఇప్పటి సమాజం, అనుబంధాలను చూస్తున్నప్పుడు మా తాతయ్యది ఎంత విభిన్నమైన వ్యక్తిత్వమో తెలుస్తోంది. అరమరికలు లేకుండా అందరితో అన్ని విషయాలూ మాట్లాడటం, అందరితోనూ కలిసిమెలిసి ఉండటం... ఈ లక్షణాలే ఆయనకు అన్ని వయసులవారిని అభిమానులుగా మార్చింది.

ఒక సాధారణ గ్రామీణ బాలుడి స్థాయి నుంచి ఎదిగి, తన కాళ్లపై తాను నిలబడి, ఒక డాక్టరుగా ఎంతోమందికి సేవలందించిన తాతయ్య జీవితం నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. ఆయనతో ఉండటం వల్ల... పనిపట్ల, వృత్తిపట్ల ఆయన చూపే క్రమశిక్షణ, ఏకాగ్రత, సమయపాలన... ఇలాంటి ఎన్నో మంచి లక్షణాలను గ్రహించే అవకాశం లభించింది. వృత్తిపట్ల అంకితభావం, ఆసక్తితో కూడిన వ్యక్తిగత శ్రద్ధ, రాజీ పడని స్వభావం, నమ్మిన విలువలు, తన

వారిపట్ల ప్రేమ, అభిమానం... ఇవన్నీ తాతయ్యను ఓ పరిణతి చెందిన వ్యక్తిత్వంతో సమున్నత స్థానంలో నిలబెట్టాయి.

సమాజం కోసం ఏదైనా చేస్తూ తాతయ్య ఎంతో తృప్తిపడేవారు. ఇది అరుదుగా కనిపించే లక్షణం. సేవా కార్యక్రమాలకి ఎంత ఖర్చు పెట్టారనే దానికి అసలు లెక్కేలేదు. ఇది తాతయ్య నుంచి నేను నేర్చుకున్న ఓ గొప్ప లక్షణం. అభిమానించే, ప్రేమించే వ్యక్తుల మధ్యే ఆయన చివరి రోజులు గడిచాయి. ఇదో అదృష్టం. ఆయనతో గడిపిన క్షణాలు గుర్తొస్తే... ఇప్పటికీ తాతయ్య స్వరం మా చెవుల్లో మారుమోగుతున్నట్లే ఉంటుంది. మా జీవితాల్లో తాతయ్య లేని లోటు ఎప్పటికీ తీర్చలేనిది.

**- జెన్**

## నిత్య స్ఫూర్తి ప్రదాత



తాతయ్య గుండెలపై పడుకుని ఆయన పాడే జోల పాటలు వింటూ నిద్రలోకి జారేవాడిని... ఇదే నాకు గుర్తున్నంత వరకూ తాతయ్యతో నా తొలి అనుభవం. మేం పిల్లలుగా ఉన్నప్పుడు మా కోసం ఎన్నో బహుమతులు తెచ్చేవారు, కొద్దిగా పెద్దవాళ్లైన తర్వాత మాతో కలసి క్రికెట్ మ్యాచ్‌లు చూసేవారు, ఆటలాడేవారు. తన చిన్ననాటి సంగతులు, అనుభవాలన్నింటినీ మాతో పంచుకునేవారు. మరోపక్క... మేం ఎలా చదువుతున్నాం... భవిష్యత్తులో ఏం చేయాలనుకుంటున్నాం... అనే అంశాలపై మా ఆలోచనలు కూడా తెలుసుకునేవారు. ఆయన మాకు కేవలం తాతయ్యే కాదు... ఓ మంచి స్నేహితుడు కూడా. మాలో ఒక్కరైనా డాక్టరు కావాలని ఆయన మనసులో కోరిక. ఆ దిశగా మమ్మల్ని ఎప్పుడూ బలవంతపెట్టలేదు. కానీ ఓ మంచి పౌరుడిగా ఎదగాలంటే ఏం చేయాలో తన మాటలు, చేతల ద్వారా మాలో ఆలోచనలు రేకెత్తించేవారు.

నాలుగేళ్లక్రితం.... స్నేహితులతో కలిసి కొన్ని రోజులు మా తాతయ్యతో గడిపాను. తిరిగి వచ్చిన తర్వాత మా స్నేహితులంతా ఎంత ఆనందించారో మాటల్లో చెప్పలేను. అప్పటి నుంచి ఎప్పుడు కలిసినా, మాట్లాడుకున్నా మా తాతయ్య యోగక్షేమాలు తెలుసుకోకుండా వాళ్లు వెళ్లేవారు కాదు. మా ఊరు మళ్లీ వెళ్లాలనుంది అని చెప్పేవారు. చదువుకోవడం, ఇంట్లో పని చేయడం నాకు అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఎంతసేపూ ఆడుకోవాలనీ, టీవీ చూడాలనీ, సరదాగా గడపాలనే ఉండేది. కానీ తాతయ్యతో ఉంటే మాత్రం... చదువైనా, ఆటైనా, పాటైనా, పనైనా... ఏదైనా సంతోషమే. నన్నెప్పుడూ ఆయన కోప్పడింది లేదు. తాతయ్యతో వాదనలో (చర్చలో) నెగ్గడం చాలా కష్టం. బహుశా నాకు కూడా ఆయన లక్షణాలే వచ్చాయని అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది.

తాతయ్యతో ఎక్కువ సమయం గడపలేకపోయానే, చివరి రోజుల్లో కూడా దగ్గర లేకపోయానే అని నాకెప్పుడూ చాలా బాధగా ఉంటుంది. కుటుంబంతో వీలైనంత ఎక్కువ సమయం గడపడానికి ప్రయత్నించాలని ఆయన ఎప్పుడూ చెప్పేవారు. ఆ మాటల్లోని అర్థం ఆయన దూరమయ్యాక తెలుస్తోంది. తాతయ్యతో గడిపిన క్షణాల్ని గుర్తుచేసుకుంటే... కళ్లలో నీళ్లు తిరుగుతాయి. భౌతికంగా మా మధ్య లేకపోవచ్చు కానీ మా గుండెల్లో ఆయన స్థానం ఎప్పుడూ పదిలమే... మంచి పౌరుడిగా, కుటుంబంలో ఓ మంచి సభ్యుడిగా ఎలా ఉండాలో ఆయనతో గడిపిన క్షణాలు, ఆయన చెప్పిన విషయాలు నిరంతరం మమ్మల్ని చైతన్యపరుస్తూ ఉంటాయి.

**- అభిజాత్**

## తాతయ్య జ్ఞాపకాలే నా నేస్తాలు



పుస్తకాలు చదివితే మన ఆలోచనల్ని స్పష్టంగా రాయగలిగే కచ్చితత్వం అలవడుతుందని, మనలో వివేకం, ఆత్మ విశ్వాసం పెంపొందుతాయని తాతయ్య చెప్పేవారు. నా మేలు కోరి ఆయన చేసిన సూచనను ఆనాడు పాటించనందుకు ఇప్పుడు చింతిస్తున్నాను. తాతయ్య గురించి నా సోదరులు రాసింది చదివాక, నేనూ అంతబాగా రాయగలుగుతానా అన్న సంశయం కలిగింది. ఒక్క క్షణం ఆలోచించా. కష్టపడు, ప్రయత్నించు, ఫలితం గురించి ఆలోచించకు అంటూ తాతయ్య చేసిన హితబోధ గుర్తుకొచ్చింది. అంతే నా ఆలోచనలన్నిటినీ కూడదీసి రాయడం మొదలు పెట్టా. అప్పుడనిపించింది రాయడం అంత కష్టం కాదని. ఆయన మాటలు గుర్తుకొచ్చినప్పుడల్లా నాలో ఆత్మవిశ్వాసం బలపడుతుంది. నేను విజేతనన్న భావన ప్రబలమవుతుంది. కష్టపడి ప్రయత్నం చేయడమే మనవంతని, ఫలితం ఎలా ఉన్నా అందరం సమానమేనని తాతయ్యే స్వయంగా చెప్పారు.

తాతయ్యతో పిచ్చాపాటీ మాట్లాడటం, ఆయనతో సమయాన్ని వెచ్చించడం వంటివి చేయకుంటే ఒక కుటుంబంలో ప్రేమానురాగాలతో కలిసి మెలిసి బతకాలన్న భావన నాకు కలిగేది కాదేమో. ఆయన నుంచి ఇంకా ఎంతో నేర్చుకునే అవకాశం ఉండీ నేర్చుకోలేకపోయానన్న బాధ నాలో ఉంది. ఇష్టంగా ఆడిన పేకాట, సామెతల పోటీలు, పీపాల కొద్దీ కూల్‌డ్రింక్ మింగేయటం, ఆబగా చాక్లెట్లు, బిస్కెట్లు తినేయడం, టీవీలో క్రికెట్ చూట్టం, బీపీ యంత్రంతో ఆడుకోవడం, ఇంటి వెనకాల క్రికెట్ ఆట.. ఈ జ్ఞాపకాలు. మదిలో ఎప్పుడూ మిగిలే ఉంటాయి. నేను నా కజిన్స్ డైనింగ్ టేబుల్ వద్ద గుమిగూడే వాళ్లం. తాతయ్య పక్కన కూర్చునే ఛాన్సు కోసం ఒకటే పోటీ. ఆయన పక్కనే కూర్చునేదెందుకంటే తాతయ్య చేతి ముద్ద తినడానికి. దీపావళి సంబరాలూ జ్ఞాపకమే. అయితే ఆయనతో గడిపిన చివరి దీపావళి ఎంతో బాధను కలిగించింది.

పుస్తకమే మనిషికి నిజమైన నేస్తమని ఎవరన్నా అంటే నేను వాళ్లను గేలి చేసేవాణ్ని. పుస్తకం మనిషి అవుతుందా అని పకపకా నవ్వేవాణ్ని. ఇప్పుడు నాకు బాగా అర్థమైంది. మనం జీవితాంతం మాట్లాడగలిగేది పుస్తకంతోనే అని. తాతయ్య చనిపోయే దాకా ఆయనను గురించిన వ్యక్తిగత విషయాలు నాకెవ్వరూ చెప్పలేదు. ఆయన జీవన విధానం, ఆయన ఎదుర్కొన్న ఆటుపోట్లు, ఆయన వ్యక్తిత్వం, ఆయన ఆలోచనలు, ఆయన ఇష్టాఇష్టాలు.. వీటన్నిటిని గురించి నాకు తెలియజేసినవారు లేరు. ఆయన చనిపోయాకే నాకు తెలిసింది నేనెంత గొప్ప వ్యక్తికి మనవణ్నో. మన్నం నరసింహం పంతులుగారు ఎలాంటి మనిషో ఆయన ఈ లోకం నుంచి వెళ్లిపోయాకే నాకు తెలిసొచ్చింది. మా తాతయ్యను గురించిన ఈ పుస్తకం ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంది. ఈ పుస్తకం నాకు జీవితాంతం నేస్తమై నిలుస్తుంది.

నిజం చెప్పాలంటే నా ఆలోచనలు, అభిప్రాయాలన్నిటినీ ఒక చిన్న పేజీలో రాసేయడం చాలా కష్టమైన పనే. అయితే నేను రాసింది మా తాతయ్యను గురించి కాబట్టే అంత తేలికగా రాయగలిగా.

**- ప్రశాంత్**

## తాతయ్యా తిరిగిన నేలకొస్తా



ఇతరుల్లో పరివర్తనను ప్రోత్సహించి వారిలో శక్తిని, ఉత్సాహాన్ని నింపే స్ఫూర్తిదాత మా తాత నరసింహం గారు. ఒంగోలుకు ఎప్పుడెళ్లినా మా కోసం ఇంటి వద్దే ఎదురుచూసేవారు. ఇప్పుడాయన లేరు. ఆ ఉత్సాహమూ లేదు. దీపావళి, దసరా సందర్భాల్లో మేమందరం తాతగారి దగ్గరికి వెళ్లే వాళ్లం. ఆయనతో ఆటపాటలు ఎంత ఆహ్లాదంగా ఉండేవో. ఇప్పుడదంతా కనుమరుగైపోయింది. నా బాల్యమంతా ఆయనతోనే గడిచింది. నేను బాగా చిన్నగా ఉన్న రోజుల్లో ఆయన నన్ను భుజానికి ఎత్తుకునే ప్రయత్నం చేస్తుండగా ఆయన బట్టలు తడిపేసిన ఘటన నాకిప్పటికీ గుర్తు. ఎప్పుడైనా నాకు అమ్మతో వాదులాట జరిగితే ఆయన నా పక్షాన నిలిచేవారు. నాకు సంతకం పెట్టడం నేర్పింది ఆయనే. నాకోసం ఎంతో చేశారు. దురదృష్టవశాత్తూ ఆయన కన్నుమూసే వేళలో నేనాయన పక్కన లేను. నా జీవితంలో చేసిన అతిపెద్ద పొరపాటు అదేనేమో. చివరి చూపు దక్కలేదు. అందుకే ఇక్కడ చదువు పూర్తి చేసిన వెంటనే భారత్‌కు తిరిగి వెళ్లి ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకోవాలనుకుంటున్నాను.

**- అకుల్**

## ఆయనతో ఉంటే సంతోషమే వేరు



పంతులుగారూ అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే నరసింహం గారు మా తాతయ్య. బాల్యంలో తాతయ్యతో నా అనుబంధం ఎలా ఉండేదో నాకు సరిగా జ్ఞాపకం లేద.ు ఏడెనిమిదేళ్ల జ్ఞాపకాలు మాత్రం నా మదిలో తాజాగానే ఉన్నాయి. మానాన్న సైన్యంలో పనిచేయడం వల్ల ఊరికి, కుటుంబానికి దూరంగానే ఉన్నాం. అయితే వేసవి సెలవల్లో తాతయ్యను కలవడానికి వెళ్లే సమయాల్లో నా మనసు ఆనందంతో ఉరకలెత్తేది. మీరంతా ఊరికి ఎందుకెళ్తారు, ఇక్కడే ఉండొచ్చుగా అని నాన్న స్నేహితులు అడిగేవారు. 'తాతయ్య దగ్గర ఉంటే ఆ మజా వేరు. ఏదడిగినా ఆయన కాదనరు' అని బదులిచ్చేవాణ్ని. మేం ఒంగోలుకు వెళ్తే తాతయ్య కావలసినన్ని కూల్‌డ్రింక్‌లు కొన్నిచ్చేవారు. ఏదడిగినా కాదనేవారు కాదు. తాతయ్యకు ఒక రిక్షా ఉండేది. ఆయన అందులోనే తిరిగేవారు. దాంట్లో ఆడుకున్న రోజులు నాకింకా గుర్తు. తాతయ్య మమ్మల్ని ఏనాడూ కొట్టలేదు. ఆయన కోపం కూడా ఎంతో సేపు నిలిచేది కాదు. ఒకసారి నికితతో కొట్లాడి ఆమెను రూంలో బంధించిన సందర్భం నాకిప్పటికీ గుర్తు. తాతకు కోపం వచ్చింది. అయితే ఆయన చిరుకోపంతో నా చెవి నులిమి వదిలేశారే కానీ నన్ను కొట్టలేదు.

మాతో మాట్లాడిన సందర్భాల్లో తాతలో ఒక ఆనందావేశం కనిపించేది. సెలవుల్లో ఇంటికి వెళ్లినప్పుడు రైలు ఉదయాన్నే ఒంగోలుకు చేరేది. అంత పొద్దున్నే తాత మా కోసం సిద్ధంగా ఉండేవారు. మమ్మల్ని ఎత్తుకొని ముద్దాడేవారు. తిరిగి వెళ్లే సమయాల్లో బాధగా ఉండేది. బాగా ఏడిస్తే నన్ను ఆయనవద్దే వదిలేస్తారనుకునే వాణ్ని. అయితే ఎంత ఏడ్చినా ఆయనను వదిలి వెళ్లక తప్పేది కాదు. మాతో ఫోన్లో మాట్లాడటం అంటే తాతయ్యకు ఎంతో ఇష్టం. నాకు తాతయ్యంటే ఎంతో ఇష్టం. ఆయన లేకపోవడం ఎంతో బాధగా ఉంది.


**- ప్రతీక్**

# మనసు - హృదయాల తోడు

నరసింహం పంతులుగారు ప్రధానంగా రెండు రంగాల్లో తన పరిధిలో జీవితాంతం సమాజానికి సేవలందించారు. అవి :1. వైద్యరంగం 2. విద్యారంగం

ఆయన పెంపకంలో పెరిగిన పిల్లలుగా, ఆయన ఆశల్ని, ఆశయాల్ని, ఆకాంక్షల్ని అందిపుచ్చుకున్నారు ఆయన పిల్లలు. ఆయన కుమారులు మన్నం వెంకటరాయుడు, మన్నం గోపీచంద్ కూడా తమదైన పద్ధతుల్లో సమాజానికి సేవల్ని అందిస్తున్నారు. సమాజం నుంచి పొందుతున్న సంపాదనలో కొంత భాగాన్ని తిరిగి సమాజానికి అందివ్వాలని వీళ్లిద్దరూ ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఈ నమ్మకాన్ని ఆచరణలో పెట్టడంలో భాగంగా ఇద్దరూ రెండు ఫౌండేషన్లను స్థాపించారు.

**మనసు ఫౌండేషన్:** మన్నం నరసింహం సుబ్బమ్మ ఫౌండేషన్‌కు పొడి అక్షరాలే 'మనసు ఫౌండేషన్' ఇంటిపేరు, అమ్మానాన్నల పేర్లు కలిసి వచ్చేలా రాయుడు గారు ఈ పేరు




పెట్టారు. ఇందులో డాక్టర్ గోపీచంద్ గారు కూడా చురుకుగా పనిచేస్తున్నారు.

మనసు ఫౌండేషన్ తెలుగు సాహిత్యం, గ్రామీణాభివృద్ధి రంగాలలో పనిచేస్తోంది.

సాహితీరంగానికి సంబంధించినంత వరకూ ఫౌండేషన్ స్థూల లక్ష్యాలు రెండు:

1. తెలుగు భాషను సుసంపన్నం చేసిన గొప్ప రచయితల సంపూర్ణ రచనా సర్వస్వాల్ని ప్రచురించి, కొత్త తరం పాఠకులకు అందించడం. ఆయా రచయితల రచనలు కాలగర్భంలో కలిసి పోకుండా పరిరక్షించి భావి తరాలకు అందించడం. ఈ లక్ష్య సాధనలో భాగంగా

ఇప్పటి వరకూ రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావు, శ్రీశ్రీ, బీనాదేవిల రచనా సర్వస్వాల్ని మనసు ఫౌండేషన్ ప్రచురించింది.




2. 19వ శతాబ్దానికి పూర్వం తెలుగు సమాజాన్ని ప్రతిఫలించిన రచయితల్ని వెలుగులోకి తీసుకొని రావటం మనసు ఫౌండేషన్ రెండవ లక్ష్యం. పై లక్ష్య సాధనలో భాగంగా ఎమ్మా రోషాంబు క్లౌ రాసిన 'While Sewing Sandals' పుస్తకాన్ని తెలుగులో 'చెప్పులు కుడుతూ కుడుతూ...'గా ప్రచురించింది. సర్ ఆర్థర్ కాటన్ కుమార్తె లేడీ హోప్ తన తండ్రి గురించి రాసిన 'The Biography of Sir Arthur Cotton' పుస్తకాన్ని 'సర్ ఆర్థర్ కాటన్ జీవితం–కృషి' పేరుతో తెలుగులోకి అనువదించి, ప్రచురించింది.

**హృదయ క్యూర్ ఎ లిటిల్ హార్ట్ ఫౌండేషన్:** ఈ ఫౌండేషన్‌ను డాక్టర్ మన్నం గోపీచంద్ 2005 జూన్‌లో హైదరాబాద్‌లో ప్రారంభించారు. హృదయానికి సంబంధించిన




వ్యాధులతో బాధపడే పేద పిల్లలకు ఈ సంస్థ ఆరోగ్య సేవల్ని అందిస్తుంది. ఇప్పటి వరకూ ఈ సంస్థ ఆధ్వర్యంలో 1151 మంది చిన్నారులకు శస్త్ర చికిత్సలు నిర్వహించింది. 1294 మంది బాలలకు వైద్య సహాయమూ అందించింది. ఇతరులకు సహాయం చేయాలనే ఆసక్తి ఉన్న వ్యక్తుల్ని, సంస్థల్ని కలుపుకొని ఒక ఉద్యమంగా పేద పిల్లలకు ఆరోగ్య సేవల్ని అందిస్తున్న డాక్టర్ గోపీచంద్ తండ్రి కీర్తిని ఇనుమడింపజేస్తున్న కొడుకుగా పేరు తెచ్చుకున్నారు.



# అందరంటేనూ ప్రాణం

పంతులు గారితో ముఖాముఖి :
అక్టోబరు–2011

**బాల్యం**

- మీకు ఊహ తెలిశాక మొట్టమొదటి జ్ఞాపకం?
  మా మామ నరసింహంతో కలిసి వంట కోసం కట్టెపుల్లలు ఏరుకురావడం.

- బాల్యంలో మీరు ఆడిన ఆటలు?
  కోతికొమ్మచ్చి, దొంగాట, కబడ్డీ లాంటి ఆటలు ఆడేవాణ్ని.

- మీ బాల్య మిత్రులెవరు.
  బంగారు, సుబ్బయ్య, రామయ్యపంతులు, శివయ్య పంతులు, వెంకటేశ్వర్లు.

- స్కూలు పుస్తకాలు కాకుండా ఇంకా ఏం చదివేవారు? సాహిత్యపరంగా ...
  పుస్తకాలు ఎక్కువగా ఇష్టపడేవాడిని. మధుబాబు పుస్తకం వచ్చిందంటే మా ఇంట్లో ఉండాల్సిందే. ఒంగోలు నుంచి పుస్తకాలు అద్దెకు తెప్పించుకునేవాడిని. మల్లాది గారి 'చంటబ్బాయి', యండమూరి 'వెన్నెల్లో ఆడపిల్ల' పిచ్చిగా చదివాను. యద్దనపూడి సులోచనారాణి పుస్తకాలు బాగా చదివేవాణ్ని. యండమూరి, డిటెక్టివ్ షాడో రచనలు ఇష్టం.

- హాస్టల్‌లో నెలకు ఎంత ఖర్చయ్యేది.
  నెలకు 8 రూపాయలు అయ్యేది. వసతి, భోజనం అన్నీ అందులోనే.

- పాఠశాలలో ఉండగా మీకు బాగా గుర్తుండిపోయిన సంఘటన?
  మా ప్రధానోపాధ్యాయులు, తెలుగు మాష్టారు అంటే నాకు బాగా ఇష్టం. ఒకసారి నేను బీడీ కాలుస్తుండగా వాళ్లు ఎదురయ్యారు. అప్పుడు చూడాలి నా అవస్థ. ఆ విషయం ఎప్పుడు గుర్తొచ్చినా నవ్వొస్తుంటుంది.

## కలలు

- మీకు కలలు వచ్చేవా? ఎలాంటివి?

  చాలా అరుదుగా మాత్రమే వచ్చేవి. ఆసుపత్రి గురించి, రోగులను చూడటం లాంటివి కలలో వస్తుండేవి. మా నాన్న ఎక్కువగా వచ్చేవాడు. ఇంకోటి– పైన ఏదో పోతూ ఉన్నట్టు, వెంటబడుతున్నట్లు, నేను తప్పించుకున్నట్లు వచ్చేది. ఇది నాకు బాగా గుర్తు.

## అభిరుచులు

- అభిరుచులేంటి?

  ఈత కొట్టడం, సినిమాలు చూడటం, ఆటలు ఆడటం.


- ఈతకొట్టడానికి ఎక్కడికి వెళ్ళేవారు?

  కొత్తపట్నం సముద్రానికి వెళ్ళేవాళ్లం. కాకపోతే అరుదుగా మాత్రమే. గుర్రపు బళ్లలో వెళ్లేవాళ్లం.


- సినిమాలు, నాటకాలు ఏమైనా చూశారా? ఏవి ఇష్టం?

  దిలీప్‌కుమార్ 'కిస్మత్' గుంటూరులో చూశాను. టికెట్ ధర పావలా. ఒంగోలులో ఉన్నప్పుడు సినిమాలు బాగా చూసేవాణ్ని. హాస్టల్ నుంచి అనుమతి లేకుండా, కాపాలాదారు కళ్లు గప్పి గోడలు దూకి సినిమాకు వెళ్లేవాళ్లం. ఇంగ్లీష్‌లో నాడియాలో భాగంగా వచ్చిన సినిమాలు నన్ను ఆకట్టుకునేవి. కాల్పనికథ, ఉత్సుకత, పోరాట దృశ్యాలు మేళవించి అద్భుతంగా తీసేవాళ్లు. ఎవరూ లేకపోతే ఒంటరిగానైనా వెళ్లి చూసేవాణ్ని.

  పాత పాటలు బాగుంటాయి. కారులో షికారుకెళ్లే, ఆడుతు పాడుతు పనిచేస్తుంటే... పాటలు



వీనుల విందుగా ఉండేవి. నాటకాలన్నా ఇష్టమే. వింధ్యారాణి నాటకం బాగుండేది. మా ఊరికి చెందిన నరసింహారావు స్త్రీ పాత్రల్లో నటించి మెప్పించేవాడు.



- మీకు బాగా నచ్చిన హీరో, హీరోయిన్లు?
  ఎన్టీఆర్, ఏఎన్నారంటే బాగా ఇష్టం. హీరోయిన్లలో కాంచన, సావిత్రి బాగా ఇష్టం.

- ఇంకా ఏం చేసేవారు?
  వ్యాయామం బాగా చేసేవాణ్ని, బస్కీలు తీసేవాణ్ని.

### ఆటలు

- ఆటలు ఆడేవారా?
  విపరీతంగా ఆడేవాణ్ని. కబడ్డీ, వాలీబాల్, చీట్లాట, దొంగాటలు ఆడేవాళ్లం. వాలీబాల్‌లో ఒకసారి జిల్లాస్థాయిలో బహుమతి కూడా వచ్చింది.

- ఆడ, మగా కలిసే ఆడేవారా ఆటలు?
  లేదు. ఎవరి ఆటలు వారికుండేవి. కబడ్డీ, వాలీబాల్‌లాంటివి మాకుంటే, అష్టాచెమ్మా, పులి–మేక లాంటివి వారికుండేవి.

### స్నేహాలు

- మీరు చదువుకునే కాలంలో మీ దగ్గరి స్నేహితులెవరు?
  జి.సత్యం, ఆంజనేయులు, వెంకట్రావు ఇలా చాలామంది మిత్రులు ఉండేవారు.

- మిత్రులంతా కలిసినప్పుడు ఎక్కువగా ఏం చేసేవారు?
  ఆటలాడటం, లేదంటే అంతా కలిసి సినిమాకి వెళ్ళేవాళ్లం.

- మీకు బాగా ఆపద సమయంలో ఆదుకున్న స్నేహితులెవరైనా ఉన్నారా?
  లేకేం! బంగారు అని ఉండేవాడు. నాకు ఆపద సమయంలో ఆయన భార్య గాజులు కుదువపెట్టి నాకు సహాయం చేశాడు.
- మీకు బాగా స్ఫూర్తినిచ్చిన స్నేహితులెవరు?
  అలాంటివాళ్లు ఎవరూ లేరు.

### మనవలు

- వాళ్ళతో మీ అనుబంధం?
  పిల్లలందరూ నాతో చాలా సన్నిహితంగా ఉంటారు. వారాంతంలో అందరూ ఫోన్లు చేసి

మాట్లాడతారు (అంతా విదేశాల్లో ఉన్నారు)

- అందర్లోను ఎవరంటే బాగా ఇష్టం?
  అందరూ నేనంటే ప్రాణం పెడతారు. నాకు అందరంటేనూ ప్రాణం. ఏ ఒక్కరినో విడిగా ప్రేమించలేను.

- మీ మనుమళ్ళు చిన్నప్పుడు మీతోపాటే ఎవరైనా ఉన్నారా?
  జెన్ ఇక్కడే నాదగ్గరే 6 నెలలు ఉండి చదువుకున్నాడు.

## జీవిత లక్ష్యం

- మీ జీవిత లక్ష్యం ఏంటి?
  ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో నా లక్ష్యం "వైద్యం చేయడం" దానికి స్ఫూర్తి ఎవరూ లేరు.
- జీవితానికి అర్థం ఏంటి?
  నా దృష్టిలో సుఖంగా బతకడమే జీవితానికి అర్థం. ఇంట్లో అందరూ కలిసిమెలిసి ఉండటమే సుఖం.



## అలవాట్లు

- మీకు మద్యపానం అలవాటు ఉందా?
  లేదు. నేను మద్యం ఎప్పుడూ ముట్టుకోలేదు.

- మీ స్నేహితులు ఎప్పుడూ మిమ్మల్ని బలవంతపెట్టలేదా?
  ఒకసారి చేశారు. కానీ నేను గట్టిగా వద్దని చెప్పాక తిరిగి ఎప్పుడూ ఒత్తిడి చేయలేదు.

- వేరే అలవాట్లు ఏమైనా ఉన్నాయా?
  చాలా–చిన్నప్పట్నుంచే బీడీలు కాల్చేవాన్ని. తర్వాతర్వాత సిగరెట్లు, చుట్టలు బాగా కాల్చేవాణ్ని. 1969 ఆ ప్రాంతంలో మానేశాను. ఇక వేరే వ్యసనాలేమీ లేవు.

## ఆహారం

- మీరు చిన్నప్పుడు ఎలాంటి ఆహారం తినేవారు?
  ఎక్కువగా వరిగ, జొన్న అన్నం తినేవాళ్లం. ఎప్పుడన్నా పండగలకి, చుట్టాలొచ్చినప్పుడు వరి అన్నం తినేవాళ్లం.

- ఎందుకలా ?

అప్పట్లో వరి పండేది కాదు. దానికి కావలసిన నీటి సదుపాయం ఉండేది కాదు.

- మరి వరి అన్నం తినడం ఎప్పట్నుంచి ప్రారంభం అయ్యింది ?

నేను ఒంగోలు వసతి గృహంలో ఉంటున్నప్పుడు వరి అన్నం పెట్టేవాళ్లు. ఆ తర్వాత నేను, నా భార్య ఒంగోలుకి వచ్చి స్థిరపడ్డాక ఇక్కడ అంతా వరి అన్నమే.

- మీకు ఏయే ఆహార పదార్థాలు బాగా ఇష్టం?

అరిసెలంటే చాలా ఇష్టం. పిల్లిపెసర గారెలు అన్నా ఇష్టమే. పెసర్లతో చేస్తారు. చాలా రుచిగా ఉంటాయి. మీరు దోసెలంటారు కదా వాటిని మేం అట్లు అంటాం. అవీ చాలా ఇష్టం.

- మాంసాహారం తినేవారా ?

శాకాహారం ఎక్కువగా తింటా. అలా అని మాంసాహారం తినకుండా ఉండను. మటన్, రొయ్యలు తినను... చికెన్, చేపలు తింటాను. చేపల్లో కొరమీను కూర అంటే నాకు చాలా ఇష్టం. మా వాళ్లు పంది మాంసం, మటన్ తినేవాళ్లు. కానీ అది అరుదుగా మాత్రమే.

- మీరు భయపడిన సందర్భాలున్నాయా ?

చాలానే ఉన్నాయి.

- ఎలాంటి వంటే మీకు భయం ?

నాకు ఒంటరిగా వేరే ఊరికి ప్రయాణం చేయాలన్నా, ఎత్తైనా ప్రదేశాలకు వెళ్లాలన్నా భయం. దానికి కారణం 'కార్డియో న్యూరోసిస్'.

- ప్రయాణాలంటే ఎందుకు భయం? ఇంకా ఏవంటే భయం?

భయం ఎందుకంటే చెప్పలేను. తిరుపతి, శ్రీ కాళహస్తి ఎక్కడికి వెళ్లాలన్నా బి.ఎల్ రావు గారితోనే వెళ్లేవాణ్ని. ఒకసారి గన్నవరం నుంచి హైదరాబాద్‌కు విమానం ప్రయాణం చేశాను. జీవితంలో అదే తొలిసారి. భయం అన్పించలేదు. తోడు మరొకరు ఉన్నందుకేనేమో! కనీసం తెలిసిన వారైనా ఉంటే భయం లేకుండా ప్రయాణించగలను. లేకుంటే కష్టమే. 'ఆశలేని కూటికి ఆకలి ఉండదు' అన్న సామెత ఉంది కదా! ఇష్టం లేనప్పుడు ఏ పనీ చేయలేం. ప్రయాణాలైనా అంతే. మరేదైనా అంతే. బెంగుళూరు, చెన్నై మాత్రమే వెళ్లాను. అంతకుమించి నేను ఎక్కడికీ తిరగలేదు. విదేశాలకైతే అసలు వెళ్లలేదు. మనమలు అక్కడుంటున్నా నాకు వెళ్లాలనిపించలేదు.

- ఇవి కాకుండా మీకు ఇబ్బంది కలిగించే సందర్భాలేమైనా ఉన్నాయా?

ఎవరైనా చనిపోతే వారి బంధువులు ఏడుస్తూ ఉంటారు. ఆ ఏడుపంటే కూడా నాకు చాలా భయం. అందుకే ఎవరూ ఏడవకుండా ఉంటేనే పోయిన వారిని చూసి వచ్చేవాడిని. ఎందుకో తెలియదు, అంత భయం నాకు. నా చిన్నతనంలో దొంగలంటే చాలా భయం.


- మీరు శస్త్ర చికిత్సలు చేసేవాళ్లు కదా. మరి అప్పుడు భయం ఉండదా?

ఆ సమయంలో అస్సలు భయపడను. రక్తం చూసినా ఏ భయమూ వేయదు.

## రాజకీయాలు

- అప్పటి స్థానిక రాజకీయాలతో మీకు అనుబంధం ఉండేదా?

నాకు చదువుకునే రోజుల నుంచే రంగా అంటే ఇష్టం. రంగా భవన్ నిర్మాణానికి చందా కూడా ఇచ్చాను. రంగా, నెహ్రూ, బోస్ వంటి వారి ఫొటోలు ఇంట్లో పెట్టుకున్నాను. రైతులకు మేలు చేశాడు. అందుకే రంగా అంటే నాకిష్టం. అందరూ కలిసి పోరాడితేనే స్వాతంత్ర్యం వచ్చింది. కాంగ్రెస్ ద్వారానే వచ్చిందంటే ఒప్పుకోను. మా సామర్థ్యం మేరకు పెద్దవాళ్లకు చెప్పి రైతులకు పనులు చేయించి పెట్టేవాళ్లం. రాజకీయ పార్టీల మీద అభిమానం ఉండేది. కానీ వాటిని నెత్తిమీద వేసుకుని తిరిగేవాణ్ని కాదు. హాస్టల్‌లో ఉండగా కాంగ్రెస్, కమ్యూనిస్టు వర్గాల మధ్య గొడవలు జరిగేవి. నేను తటస్థంగా ఉంటూ వాటిని చల్లార్చేవాణ్ని.



- అప్పుడు కమ్యూనిస్టులు ఉండేవాళ్లు కదా ? వాళ్లు రైతులకు సహాయం చెయ్యలేదా?

వాళ్లు చేసిన సహాయం పెద్దగా లేదు. వాళ్ల 'ఆల్ గోస్ టు గవర్నమెంట్' సిద్ధాంతం నాకు నచ్చలేదు.

- స్వాతంత్రోద్యమం సమయంలో మీ ఊరి పరిస్థితులేంటి?

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మా ఊళ్లోనే ఉన్నాను. కానీ ఆ సందడేమీ ఊరి ప్రజల్లో కనిపించలేదు. స్వాతంత్ర్యం కోసం పోరాడే కుర్రవాళ్ళతో నేనూ తిరిగేవాణ్ని. కాంగ్రెస్ పార్టీ నుంచి సందేశాలు వచ్చేవి. మేం అనుసరించే వాళ్లం.

- గాంధీ గురించి...

పత్రికల ద్వారా గాంధీ గురించి తెలుసుకున్నా కానీ

కలుసుకోలేదు. కానీ గాంధీ కంటే ముందే మేం రాట్నం వడుకుతుండేవాళ్లం. ఖద్దరు బట్టలు వేసేవాణ్ణి. నాకు గాంధీ అంతగా నచ్చడు. నెహ్రూ నచ్చుతాడు. సుభాష్ చంద్రబోస్ అంటే చాలా ఇష్టం.

**ఇతరాలు**

- వ్యవసాయం ఎన్నేళ్లు చేశారు?

  5 ఏళ్లు చేశాను.

- అప్పట్లో మీ ఊళ్లో వేసే పంటల గురించి...

  జొన్న, వరిగ, రాగులు, సజ్జలు, కందులు, పెసరలు, పొగాకు (తక్కువగా) లాంటివి వుండేవి.



- అప్పట్లో పెట్టుబడిదారులు ఎవరు?

  కోమట్లేపెట్టుబడిదారులు. పంట చేతికొచ్చాక లెక్క ప్రకారం గింజలిస్తాం.

- ఊళ్లో కరవొచ్చిన సందర్భాలు...

  అప్పట్లో చిన్న చిన్న కరవులుండేవి. పశువులకు ఆహార కొరత ఉండేది. మా కుటుంబానికి మాత్రం ఎప్పుడూ ఇబ్బంది రాలేదు.

- ఊర్లో వైద్యం ఎలా అందేది?

  ఊళ్లో వైద్యులు ఉండేవారు. ఏ జబ్బు వచ్చినా విరోచన మాత్రలు వేసేవారు.

- జీవితంలో మీకు బాగా ఇష్టమైన దశ..

  ఎవరికైనా కౌమారదశ బాగుంటుంది. ఆ వయసంటే చాలా ఇష్టం. కష్టాలు, నష్టాలు, బాధలు ఏమీ ఎరగం. చుట్టలు తాగడం, పిల్లకాయలతో తిరగడం, సినిమాలు చూడటం కాదు ఆనందమంటే. పాలు పితకడం లాంటి పనుల్లోనూ ఎంతో సంతోషం పొందేవాడిని. పనుల్లో నాకు ఎక్కువ సంతోషం దొరికేది. వ్యవసాయ పనులంటే అమితమైన ఇష్టం.

- మీకు తీరని కోరికలు ఏమైనా ఉన్నాయా?
  ఏమీ లేవు.

- మీ తీరిక సమయాన్ని ఎలా గడిపేవారు?
  తీరికంటూ ఉండేది కాదు. ఆస్పత్రిలోనే కాలమంతా గడిచేది. ఇంటికొస్తే మాత్రం మా పిల్లలతో ఉండేవాణ్ని.

- మీకు నచ్చిన, నచ్చని రంగులు?
  తెలుపు రంగంటే ఎందుకో ఇష్టం. అందుకే ఆ రంగు దుస్తులు ధరిస్తాను. ఎరుపంటే అస్సలిష్టం లేదు.

**దేవుడిపై నమ్మకం ...**

- భక్తి అనేది ఒక మానియా. మన వెనకాల నడిపించే శక్తి ఒకటుందని నమ్ముతాను కానీ దేవుడు, దెయ్యం అంటే నమ్మకం లేదు.

- మీరు ఆర్.ఎం.పి. కానీ ఎంబీబీఎస్‌లు చేసే శస్త్ర చికిత్సలు చేశారు... ఇది చట్ట వ్యతిరేకం కదా.. మీపై కేసులేమీ లేవా?
  అలాంటిదేమీ లేదు. నేను నిపుణులైన వైద్యులు పక్కన ఉంటేనే చికిత్స చేశాను. అయినా ఎవరైనా ఫిర్యాదు చేస్తే కదా... కేసులుండేవి.

- బీవీఎల్ ఆస్పత్రిలో మందుల కొట్టు ఎందుకు మూసేశారు?
  బి.ఎల్. రావుగారి మందుల కొట్టు 18 సంవత్సరాలు నడిపించాను. మాకు పొగాకు పంట వల్ల నష్టం వచ్చింది. మా అన్న పొలం కొని అప్పులు ఇంకా ఎక్కువ చేశారు. మందుల షాపు ద్వారా వచ్చిన ఆదాయంతోనే అవన్నీ తీర్చగల్గాం. అందుకే షాపు మూలన పడింది.

- నారాయణ గారితో మీ సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయి?
  చెప్పుకునేంత పెద్దదేం కాదు. అందుకే మా పిల్లలతోనూ ఎప్పుడూ చెప్పలేదు. చెప్పడం నాకు ఇష్టమూ లేదు. అయితే ఆయన మాత్రం సత్తా ఉన్నవాడు, అవసరమైతే రోగుల ఇంటికి సైతం వెళ్లి వైద్యం చేసేవాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే చాలా మంచివాడు. వచ్చిందల్లా ఒకటే సమస్య. బండబూతులు తిట్టే అలవాటు. కోసం వస్తే రోగుల్ని కూడా తిట్టేవాడు. నన్ను మాత్రం ఏమీ అనేవాడు కాదు. పంతులు అంటూ అప్యాయంగా పిలిచే వాడు. మూడుసార్లు ఎమ్మెల్యేగా నిలబడి రెండుసార్లు గెలిచాడు.

- సినిమాలు చూసి ఎప్పుడైనా ఏడ్చారా?
  చాలాసార్లు ఏడ్చాను. కొన్ని దృశ్యాలు చూసినప్పుడు కన్నీళ్లు వాటికవే వచ్చేవి.

- ఇప్పటికీ మీ ఆరోగ్య రహస్యం...
  యోగా, ఆటలు, నడక, మెడిటేషన్ లాంటివి చేస్తుంటాను.

- మీ ఇంట్లో ఉండి చదువుకునే వాళ్లందరికీ వండిపెట్టడం సుబ్బమ్మగారికి ఇబ్బందిగా అన్పించలేదా?
  చాలా మంది మా ఇంట్లో ఉండి చదువుకున్నారు. వారికి అన్ని వసతులూ కల్పించేవాళ్లం. మా సుబ్బమ్మ అందరికీ వండిపెట్టేది. అంత కష్టం పడాలంటే ఓపిక ఒక్కటే కాదు, ప్రేమ కూడా ఉండాలి. ఓపిక అందరిలోనూ ఉంటుంది. ఈతరం వారికి లేదంటే.. ఉండచ్చు, ఉండకపోవచ్చు. దానికి తరమేముంది? వ్యక్తి స్వభావాన్ని బట్టి ఉంటుంది కానీ!

- మీకు ఏ పని సంతృప్తినిచ్చింది?
  మా ఊరిలో రూ.లక్షా యాభైవేలతో ఆసుపత్రి కట్టించాను. నా సొంత డబ్బుని అందుకు వెచ్చించాను. బీవీఎల్ ఆసుపతిత్రిలోనూ వైద్యం చేశాను. సొంతగానూ వైద్యం చేశాను. ఒకటి జనం కోసం చేస్తే రెండోది నా ఆత్మతృప్తి కోసం చేశాను. రెండింటినీ పోల్చలేను.



- దేవుడు ప్రత్యక్షమై ఏదైనా కోరుకొమ్మంటే...
  దురాశను దూరం చేయమంటాను.

- వెనక్కి తిరిగి చూస్తే ఏమనిపిస్తుంది?
  నాకు తోచిన సహాయం చేశాను. మంచిగా జీవించాను. నా తాహతుకు మించి జనాలకి వైద్యం చేశాను. నా వల్ల చాలామంది చదువుకున్నారు. ఆ తృప్తి చాలు నాకు.

- భవిష్యత్ తరాలకు మీ సందేశం.
  మీరు సంపాదించిన దాంట్లో కనీసం 5% పేదలకు సహాయం చేయండి.



- బుద్ధి, తార్కిక శక్తులతో మాత్రమే విషయాల్ని అర్థం చేసుకోవడం కాదు. మానవీయ విలువలు, భావోద్వేగాల కోణంలోనూ చూడాలి.
- మనల్ని నడిపించే శక్తి ఒకటుందని మాత్రమే నమ్ముతాను. కానీ దేవుడు, దెయ్యం అంటే నమ్మకం లేదు.
- 'ఆశలేని కూటికి ఆకలి ఉండదు' అన్న సామెత ఉంది కదా! ఇష్టం లేనప్పుడు ఏ పనీ చేయలేం.
- మనం సంపాదించేదంతా సమాజం ఇచ్చేదే. దాంట్లో కొంత భాగమైనా తిరిగి సమాజం కోసం వెచ్చించాలి. అందుకే ప్రతి వారూ తాము సంపాదించిన దాంట్లో కనీసం 5% పేదలకు సహాయం చేయాలి.
- నాకు తోచిన సహాయం చేశాను. మంచిగా జీవించాను. నా తాహతుకు మించి జనాలకి వైద్యం చేశాను. నా వల్ల చాలామంది చదువుకున్నారు. జీవితాల్ని చక్కదిద్దుకున్నారు. ఆ తృప్తి చాలు నాకు.

- మన్నం నరసింహం